Email : telanganaveenaoffcial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..




epaper.telanganaveena.com | సంపుటి :1 | సంచిక: 373 | హైదరాబాద్ | శుక్రవారం | 27 -09 - 2024 | పేజీలు: 8 | రూ.3/-





## అధికారుల తప్పిదానికి సాక్ష్యం

# కాళేశ్వరం

● నాణ్యత విషయంలో రాజీపడరాదు ● 700 మంది ఎఇఇలకు నియామక పత్రాలు ● ఐదేళ్లకే కుప్పకూలడంతో కోట్లు వృధా ● గత ప్రభుత్వ నిర్వాకంపై సిఎం రేవంత్ రెడ్డి

**తెలంగాణవీణ/హైదరాబాద్,సెప్టెంబర్26:** అధికారులు జీవితంలో ఎలాంటి తప్పు చేయకూడదో దానికి ఉదాహరణ కాళేశ్వరం ప్రాజెక్టు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ నీటి పారుదల శాఖలో కొత్తగా ఎంపికైన 700 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు సీఎం చేతుల మీదగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లో ఉన్న జలసౌధలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. పైఅధికారులు చెప్పారని నాణ్యత, నిబద్ధత విషయంలో ఎప్పుడూ రాజీపడొద్దని అన్నారు. నాణ్యత లోపిస్తే ప్రాజెక్టులు దీర్ఘకాలం నిలబడవు. నాణ్యతగా లేకుంటే.. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు ఇన్నేళ్లు ఉండేవి కావు. దశాబ్దాల క్రితం నిర్మించిన నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు లక్షల ఎకరాలకు నీళ్లు, విద్యుత్ ఇస్తున్నాయి. కానీ, ఐదేళ్ల క్రితం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు అప్పుడే కూలిపోయింది. నిర్మాణం పూర్తి కాకముందే కూలిపోయిన కాళేశ్వరం ప్రాజెక్టును ఎలా అధ్యయనం చేయాలి. ఈ ప్రాజెక్టును గత పాలకులు ప్రపంచ అద్భుతంగా వర్ణించారు. కాళేశ్వరం విషయంలో ఎవరిని బాధ్యులుగా చేయాలి? క్షేత్రస్థాయిలో ఇంజినీర్లు సమర్థంగా పనిచేసి ఉంటే.. ఈ పరిస్థితి వచ్చేది కాదని అన్నారు. నిర్మాణ సామగ్రి నాణ్యతగా లేదని ఇంజినీర్లు వెనక్కి

వివరాలు 2లో

## పాఠ్యాంశాల్లో చాకలి ఐలమ్మ చరిత్ర

**తెలంగాణ వీణ/హైదరాబాద్,సెప్టెంబర్26:**చాకలి ఐలమ్మ చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు ఎంపీ లక్ష్మణ్ అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చాకలి బండానే స్ఫూర్తిగా చేసుకొని నిజాంకి

వివరాలు 2లో

ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు లక్ష్మణ్



# ఫార్మా సిటీ రద్దు వెనుక వేల కోట్ల కుంభకోణం

- ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ దందాకు పాల్పడతే సహించం
- రైతుల నుంచి సేకరించిన భూములు తిరిగి ఇచ్చేయండి
- అతిగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తప్పవు
- మీడియా సమావేశంలో కెటిఆర్ హెచ్చరిక



**తెలంగాణ వీణ/రాజన్న సిరిసిల్ల,సెప్టెంబర్26:** హైదరాబాద్ ఫార్మా సిటీ రద్దు వెనుక వేల కోట్ల కుంభకోణం జరుగుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇది పక్కా రియల్ ఎస్టేట్ దందా అని కేటీఆర్ ఆరోపించారు. ఫ్యూటచర్ సిటీ పేరుతో రియల్ దందాకు సిఎం రేంవత్ తెరలేపారని అన్నారు. ఫార్మా సిటీని రద్దు చేస్తేఆ భూములను తిరిగి రెతులకు ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. రాజన్న సిరిసిల్లలోని బీఆర్ఎస్ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఫార్మా సిటీని రద్దు చేస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ చాలా స్పష్టంగా ఎన్నికలకు ముందు చెప్పింది. ఇబ్రహీంపట్నం, మహేశ్వరంతో పాటు ఇతర వేదికల ద్వారా రేవంత్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.. చాలా మంది నాయకులు స్పష్టంగా చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుందని ఇష్టమొచ్చినట్లు మాట్లాడారని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ ఏర్పడిన తర్వాత.. ఫార్మా సిటీ రద్దు అని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రకటనలు చేశారు. అయితే ఫార్మా సిటీ ఉన్నదా..? పోయిందా..? అని కొందరు రైతులు హైకోర్టును ఆశ్రయించారు.

వివరాలు 2లో

## హూవర్ డ్యామ్‌ను సందర్శించిన

# ఉప ముఖ్యమంత్రి భట్టి



**తెలంగాణ వీణ/హైదరాబాద్,సెప్టెంబర్26:**అమెరికాలోని నేవడ, అరిజోన రాష్ట్రాల సరిహద్దులో కొలరాడో నదిపై ఎనిమిది దశాబ్దాల క్రితం నిర్మించిన అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టు హూవర్ డ్యామ్ ఎంతో ఆదర్శవంతమైందని, ఇక్కడి నీటి వినియోగం, అమలవుతున్న రక్షణ చర్యలు ఆచరించదగినవని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు. అమెరికాలో అధికారిక పర్యటనలో ఉన్న ఆయన బుధవారం నాడు రాష్ట్ర ప్రతినిధి బృందంలో ఉన్న ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, సింగరేణి సిఎండీ ఎన్.బలరామ్, స్పెషల్ సెక్రెటరీ కృష్ణ భాస్కర్

వివరాలు 2లో

## దేశీయంగా మూడు సూపర్

# కంప్యూటర్ల అభివృద్ధి

● పరమ్ రుద్ర కంప్యూటర్లను ప్రారంభించిన ప్రధాని మోడీ

**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 :** దేశీయంగా అభివృద్ధి చేసిన మూడు సూపర్ కంప్యూటర్లను ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించారు. శాస్త్రీయ పరిశోధనల కోసం రూ.130 కోట్లతో పుణె, దిల్లీ, కోల్‌కతాలో ఏర్పాటు చేసిన 'పరమ్ రుద్ర' సూపర్ కంప్యూటర్లను నుంచి ఆయన దిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. వాతావరణ పరిశోధనల కోసం రూ.850 కోట్లతో రూపొందించిన హై-పెర్ఫామెన్స్ కంప్యూటింగ్ సిస్టమ్‌ను సైతం ప్రధాని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ రోజును శాస్త్ర, సాంకేతిక రంగంలో చాలా గొప్ప విజయాలు సాధించిన రోజుగా పేర్కొన్నారు. సాంకేతిక విప్లవ యుగంలో కంప్యూటింగ్ సామర్థ్యం జాతీయ సామర్థ్యానికి ప్రత్యామ్నాయంగా మారిందన్నారు. సాంకేతిక, కంప్యూటింగ్ సామర్థ్యంపై ఆధారపడని రంగమంటూ ఏదీ లేదని తెలిపారు. ఈ సాంకేతిక విప్లవంలో మన వాటా బిట్స్, బైట్స్‌లో కాదు.. టెరా బైట్లు, పెటా బైట్లలో ఉండాలన్నారు. భారతదేశం సైన్స్, టెక్నాలజీ, పరిశోధనలకు ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతోందన్నారు. సొంతంగా సెమీకండక్టర్ ఎకో సిస్టమ్‌ను నిర్మించడంతో పాటు ప్రపంచంలోని సరఫరా గొలుసులో కీలకంగా ఉన్నట్లు పేర్కొన్నారు. సైన్స్ ప్రాముఖ్యత కేవలం ఆవిష్కరణలు, అభివృద్ధి



వరకే పరిమితం కారాదన్న ప్రధాని.. దేశంలో ఆఖరి పౌరుడి ఆకాంక్షలను సైతం నెరవేర్చేలా ఉండాలన్నారు.

# కాంగ్రెస్ తుఫాన్‌లో బిజెపి కొట్టుకుపోవడం ఖాయం



## - హర్యానా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రాహుల్

**తెలంగాణ వీణ/ఛండీగఢ్,సెప్టెంబర్ 26:**దేశంలో నిరుద్యోగ సమస్య తాండవిస్తోందని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అన్నారు. ప్రధాని మోదీ పక్కా ప్రణాళిక ప్రకారం ఉపాధి రంగాన్ని నిర్వీర్యం చేశారని విమర్శించారు. దేశంలో ఉద్యోగాల కొరతకు మోదీ కారణం కాదా? అని ప్రశ్నించారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన చండీగఢ్‌లో పర్యటించారు. ప్రధాని మోదీ ప్రజలను విభజించి పాలిస్తున్నారనీ, ఒకరిని చూసి మరొకరు అసహ్యించుకునేలా తయారు చేశారని మండిపడ్డారు. హరియాణాలో భాజపా కుప్పకూలడం ఖాయమని, తాజా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభు త్వాన్ని ఏర్పాటు చేస్తుందని

వివరాలు 2లో

## వీరనారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన సీఎం



**తెలంగాణ వీణ/హైదరాబాద్,సెప్టెంబర్26:** తెలంగాణ సాయుధ పోరాట యోధు రాలు చాకలి (చిట్యాల) ఐలమ్మ కి ముఖ్యమంత్రి ఘనంగా నివాళులు అర్పించారు.ఐలమ్మ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి జూబ్లీ హిల్స్ నివాసంలో ఆ వీరనారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.సీఎంతో పాటు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్అలీ,ఎమ్మెల్యే శ్రీగణేష్,పలువురు నాయకులు పాల్గొన్నారు.

## 30 రోజుల్లో ప్రజలకు డిజిటల్ హెల్త్‌కార్డులు

### - సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి

**తెలంగాణ వీణ/హైదరాబాద్,సెప్టెంబర్26:** మరో 30 రోజుల్లో ప్రజలకు డిజిటల్ హెల్త్‌కార్డులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ ఆస్పత్రిని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. విద్య, ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. పేదలకు అతి తక్కువ ఖర్చుతో వైద్యం అందించాల్సి ఉంది. ప్రతి ఒక్కరికీ విడివిడిగా హెల్త్ ప్రొ÷ల్ రూపొందించాలి. రాష్ట్రంలోని 4 కోట్ల ప్రజల హెల్త్ ప్రొ÷ల్స్‌ను డిజిటలైజ్ చేయాల్సి ఉంది. ఈ హెల్త్‌కార్డుల్లో గత చికిత్స వివరాలు పొందుపరుస్తారు'అని తెలిపారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్ సంఘం ప్రతినిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల్లో భాగం కావాలని కోరారు.

## చెరువులో విలాస భవనం

### - బాబులతో కూల్చేత

**తెలంగాణ వీణ/సంగారెడ్డి,సెప్టెంబర్26:** సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మధిర గ్రామం కుతుబ్‌శాయి పేట్ గ్రామంలో రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు అక్రమ నిర్మాణాన్ని గుర్తించారు. కొందరు వ్యక్తులు చెరువులోనే బహుళ అంతస్తుల భవనం కట్టడంతో చర్యలు తీసుకున్నారు. బాంబుల ద్వారా అక్రమ కట్టడాన్ని నేలమట్టం చేశారు. ఈక్రమంలో బాంబులు పేలి శిథిలాలు ఎగిరిపడటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. సికింద్రాబాద్‌కు చెందిన వ్యక్తి 12 సంవత్సరాల క్రితం మల్కాపురం పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఈ భవనాన్ని నిర్మించారు. నీళ్లలో అడుగుపెట్టకుండా లోనికి వెళ్లడానికి కొంత దూరం నుంచే మెట్లు కట్టారు. యజమాని కుటుంబ సభ్యులు వారాంతాల్లో వచ్చి ఇక్కడ సేదతీరుతూ ఉండేవారు.

## జర్నలిస్టుల అక్రిడేషన్ 3 నెలలు పొడిగింపు

**తెలంగాణవీణ/హైదరాబాద్,26:** రాష్ట్రంలో వర్కింగ్ జర్నలి స్టుల అక్రిడేషన్ గడువును మరో 3 నెలల పాటు పొడిగిస్తూ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంత రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 30వ తేదీతో అక్రిడేషన్ కార్డుల గడువు ముగియనుంది. తదితర కారణాల వల్ల ఈ గడువును మరో మూడు నెలల పాటు పొడిగిస్తున్నట్లు ఐ అండ్ పీఆర్ అధికారులు పేర్కొన్నారు. అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31వరకు అక్రిడేషన్ల గడువును పొడిగిస్తూ ఆయా జిల్లాల కలెక్టర్లు, ఆర్టీసీ సంస్థకు అధికారులు తెలియజేశారు.

## 5న పిఎం కిసాన్ నిధుల విడుదల

**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ,సెప్టెంబర్26:** కేంద్రం రైతులకు శుభవార్త తెలిపింది. పీఎం కిసాన్ 18వ విడత నిధులను అక్టోబర్ 5న విడుదల చేయనున్నట్లు గురువారం ప్రకటించింది. ఈ పథకం ద్వారా కేంద్రం ఏటా ఒక్కో రైతుకు రూ. 6 వేల చొప్పున సాయమందిస్తోంది. 2018 డిసెంబర్‌లో ఈ పథకాన్ని ప్రారంభించింది. డీబీటీ ద్వారా డబ్బులు నేరుగా రైతుల ఖాతాల్లో జమవుతున్నాయి. ప్రతి నాలుగు నెలలకొకసారి రూ. 2 వేలచొప్పున మూడు వాయిదాలలో డబ్బు ఇస్తున్నారు. పీఎం కిసాన్ యోజన 16వ విడతలో 93 మిలియన్ల మంది రైతులు ఒక్కొక్కరు రూ.2 వేల వరకు లబ్ధిపొందారు. పీఎం కిసాన్‌కు అర్హత పొందాలంటే ఈకేవైసీ తప్పనిసరి అంటున్నారు అధికారులు. ఇందుకోసం..

## కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో రసాభాస

**తెలంగాణవీణ/దుబ్బాక,సెప్టెంబర్26:** సిద్దిపేట జిల్లా దుబ్బాకలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది. ఈ కార్యక్రమానికి మంత్రి కొండా సురేఖ, భాజపా ఎంపీ రఘునందన్‌రావు, భారాస ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డితో పాటు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. మంత్రితో పాటు శ్రీనివాస్‌రెడ్డి వేదికపైకి వెళ్లారు. ఆయన వేదికపై ఉండొద్దని ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రొటోకాల్ పాటించాలని పట్టుబట్టారు. దీంతో కాంగ్రెస్, భారాస కార్యకర్తలు పోటాపోటీ నినాదాలు చేసుకున్నారు. ఈ క్రమంలో తోపులాట జరిగింది. రసాభాస మధ్యే మంత్రి కొండా సురేఖ చెక్కులను పంపిణీ చేశారు.

## పాఠ్యాంశాల్లో చాకలి ఐలమ్మ చరిత్ర

(మొదటి పేజీ తరువాయి)

వ్యతిరేకంగా ఐలమ్మ పోరాడిందని తెలిపారు. నిజాం తొత్తులను గ్రామాల నుండి పారద్రోలిందన్నారు. బీజేపీ ఉద్యమం వల్లనే నిజాం వ్యతిరేకంగా పోరాడిన యోధుల ను అన్ని పార్టీ లు, వర్గాలు స్మరించుకుంటున్నాయి. వారికి గౌరవం తగ్గిందన్నారు. మహిళ విశ్వవిద్యాలయానికి రేవంత్ రెడ్డి చాకలి ఐలమ్మ పేరు పెట్టడం స్వాగతిస్తున్నానని తెలిపారు. ఎందుకు విమోచన దినం జరపరని రేవంత్ రెడ్డి నీ ప్రశ్నిస్తున్నామన్నారు. రజాకార్ల వారసుల పార్టీ మజ్లిస్ కు ప్రభుత్వాలు తలొగ్గాయన్నారు. చాకలి ఐలమ్మ పై గౌరవం ఉంటే 42 శాతం స్థానిక సంస్థల్లో బీసీ లకి రిజర్వేషన్ లు కల్పించాలన్నారు. రేవంత్ రెడ్డి కి మనసు రావడం లేదన్నారు. కుల గణనతో దాటవేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. చాకలి ఐలమ్మ చరిత్ర ను పాఠ్యాంశాల్లో చేర్చాలన్నారు. చాకలి కులాన్ని ఎస్సీ లలో చేర్చాలనే డిమాండ్ ఉందని తెలిపారు. కుల గణన పేరుతో మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆరోపించారు. రిజర్వేషన్ లు ఎత్తి వేస్తామని రాహుల్ గాంధీ అంటున్నారు? దీని పై రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు.

## హూవర్ డ్యామ్‌ను సందర్శించిన ఉప ముఖ్యమంత్రి భట్టి

(మొదటి పేజీ తరువాయి)

ఇంకా ఇతర అధికారులతో కలిసి హూవర్ డ్యామ్ ను సందర్శించారు. ఫెడరల్ గవర్నమెంట్ అధికారులు వారికి ప్రాజెక్టు వివరాలను స్వయంగా వివరించారు.తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడిన కాలంలో 1931-36 మధ్య నిర్మించిన ఈ ఆర్క్ గ్రావిటీ నిర్మాణం ఒక ఇంజనీరింగ్ అద్భుతమని, ఇక్కడ గల 17 జనరేటర్ల ద్వారా 2080 మెగావాట్ల జల విద్యుత్తు ఉత్పత్తి అవుతుందని, తద్వారా మూడు రాష్ట్రాల విద్యుత్ అవసరాలను తీరుస్తుందని అధికారులు వివరించారు. ఈ ప్రాంతంలోని మూడు ప్రధాన పట్టణాల్లో ఉన్న 80 లక్షల మంది ప్రజల మంచినీటి అవసరాలతో పాటు సాగునీటి అవసరాలు కూడా హూవర్ డ్యామ్ తీరుస్తుందని వారు వివరించారు. 726 అడుగుల ఎత్తు, 1244 అడుగుల పొడవు ఉన్న ఈ డ్యామ్ వెనుక ఒక పెద్ద కృత్రిమ సరస్సు ఏర్పడిందని, పూర్తి నీటి నిలువ సామర్థ్యం ఉన్నప్పుడు 185 కిలోమీటర్ల పొడవున నీటితో విస్తరించి ఉంటుందని వివరించారు. ఏటా సుమారు 80 లక్షల మంది పర్యాటకులు దీన్ని సందర్శిస్తారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి అక్కడ జరుగుతున్న జల విద్యుత్తు ఉత్పాదకత, యంత్రాల సామర్థ్యం, నీటి లభ్యత, అడుగడుగునా ఏర్పాటు చేసిన రక్షణ చర్యలు, ఇంకా ఇతర సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. తెలంగాణలో గల జల విద్యుత్తు ప్రాజెక్టుల సమాచారంతో బేరీజు వేస్తూ హూవర్ డ్యామ్ జలవిద్యుత్తు ఉత్పాదకతను స్ఫూర్తిగా తీసుకొని మన ప్రాజెక్టుల సామర్థ్యం పెంపుదలకు, రక్షణ మెరుగుదలకు గల అవకాశాలను పరిశీలించాలని రాష్ట్ర అధికారులను కోరారు. ఈ సందర్భంగా 1931 నుండి 35 మధ్య జరిగిన డ్యామ్ నిర్మాణ దృశ్యాలను, ఫోటోలను డ్యామ్ అధికారులు ప్రదర్శించారు.**వర్చువల్ రియాలిటీ సాయంతో బొగ్గు ఉత్పత్తి ఒక అద్భుతం...** మైనెక్స్-2024 అంతర్జాతీయ ప్రదర్శనలో భట్టి విక్రమార్క మల్లు రాష్ట్ర ప్రతినిధి బృందంతో కలిసి వివిధ ప్రఖ్యాత కంపెనీల స్టాల్స్ ను సందర్శించారు. శాండ్విక్ కంపెనీ స్టాల్ లో ఏర్పాటు చేసిన అత్యాధునిక కంటిన్యూయస్ మైనర్ యంత్రాన్ని పరిశీలించారు. అనంతరం అదే స్టాల్లో ఏర్పాటు చేసిన వర్చువల్ రియాలిటీ మైనింగ్ టెక్నాలజీని స్వయంగా పరిశీలించారు.ఈ వర్చువల్ రియాలిటీ ద్వారా గని లోపల పరిస్థితుల్ని కళ్ళకు కట్టినట్టు చూపిస్తున్నందు వల్ల యంత్రాలను నడిపే ఆపరేటర్లు దీనితో మెరుగైన శిక్షణ పొందేందుకు అవకాశం ఏర్పడుతుందని నిర్వాహకులు తెలిపారు. అలాగే ఈ వర్చువల్ రియాలిటీతో గని యొక్క పని ప్రదేశానికి యంత్రాన్ని పంపించి అక్కడి పరిస్థితులను వెలుపలు నుండే అంచనా వేస్తూ బొగ్గును త్రవ్వొచ్చని, ఇది అత్యాధునిక మైనింగ్ పద్ధతిగా నిలుస్తుందని నిర్వాహకులు చెప్పారు. భట్టి స్వయంగా వర్చువల్ రియాలిటీ సాంకేతికతను హెడ్ గేర్ ధరించి పరిశీలించారు.ఈ సాంకేతికత వల్ల కలిగే ప్రయోజనాలు అద్భుతం అని, ఈ ఆధునిక సాంకేతికత వల్ల కార్మికులకు చిన్న ప్రమాదం జరగకుండా ఉత్పత్తిలో పాల్గొనే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల రక్షణను దృష్టిలో పెట్టుకొని ఈ తరహా సాంకేతికతను ప్రస్తుత గనుల్లో, భవిష్యత్తు గనుల్లో ఏర్పాటు చేయడానికి గల అవకాశాలను పరిశీలించాలని బృందంలో ఉన్న సింగరేణి సిఎండీ ఎన్.బలరామ్ ను కోరారు. ఈ ప్రదర్శనలో ఇంకా రోనాల్డ్ రోస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ తుఫాన్‌లో బిజెపి కొట్టుకుపోవడం ఖాయం

(మొదటి పేజీ తరువాయి)

ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ తుపాను రాబోతోంది. అందులో భాజపా కొట్టుకుపోవడం పక్కా. రాష్ట్రాన్ని ఆ పార్టీ సర్వనాశనం చేసింది. అందుకు ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారు. ఇటీవల అమెరికా వెళ్లినప్పుడు అక్కడ ఉంటున్న హరియాణా వాసులను కలిశాను. డల్లాస్, టెక్సాస్‌లో ఒక్కో గదిలో 15 నుంచి 20 మంది ఉన్నారు. ఇక్కడికెలా వచ్చారని అడిగితే.. హరియాణాలో కనీసం ఉపాధి దొరకడం లేదు. ఎలాగైన బతుకుసాగించాలన్న ఉద్దేశంతో ప్రమాదకర స్థితిలో కజకిస్థాన్, తుర్కియే, దక్షిణ అమెరికా దేశాలు దాటి వచ్చి ఇక్కడ జీవనం సాగిస్తున్నామని చెప్పారు. కొందరు తమ వ్యవసాయ భూమిని విక్రయించి, ఆ డబ్బులతో అమెరికా వెళ్లినట్లు చెప్పారు. ఇక్కడే ఉపాధి అవకాశాలు ఉంటే యువతకు ఇలాంటి గతి పట్టేదా? ప్రజల తలరాతలు మారాంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని రాహుల్ గాంధీ అన్నారు.

## మూసీ పరివాహకంలో అధికారుల సర్వే

### - అధికారుల సర్వేపై స్థానికుల ఆగ్రహం - ఇక్కడి నుంచి తొలగిస్తే పోయేది లేదని హెచ్చరిక - ఇంటింటి సర్వేతో మార్కింగ్ చేపట్టిన అధికారులు

**తెలంగాణ వీణ/హైదరాబాద్,సెప్టెంబర్26:** రాజధానిలో మూసీ నది పరివాహక ప్రాంతాల్లో ఉద్రిక్తత నెలకొంది. భారీ పోలీసు బందోబస్తు మధ్య అధికారులు సర్వే చేపట్టారు. మూడు జిల్లాల పరిధిలో మొత్తం 25 ప్రత్యేక సర్వే బృందాలు పర్యాటిస్తున్నాయి. హైదరాబాద్ జిల్లా పరిధిలో 16 బృందాలు, రంగారెడ్డి జిల్లాలో నాలుగు, మేడ్చల్‌లో 5 బృందాలు సర్వే చేస్తున్నాయి. నదీ గర్భంలోని నిర్వాసితుల నిర్మాణాల వివరాలను రెవెన్యూ అధికారులు అడిగి తెలుసుకున్నారు. మూసీ నదిలో ఉన్న బఫర్ జోన్‌లోని నిర్మాణాలకు మార్కింగ్ చేస్తున్నారు. చాదర్‌ఘాట్, మూసానగర్, శంకర్‌నగర్‌లోని మూసీ పరివాహక ప్రాంతాల్లో అధికారులు సర్వే చేపట్టారు. హిమాయత్‌నగర్ తహసీల్దార్ సంధ్యారాణి ఆధ్వర్యంలో ఇది కొనసాగుతోంది. గోల్కొండ పరిధిలోని ఇబ్రహీంబాగ్ ప్రాంతంలోనూ సర్వే చేశారు. లంగర్‌హౌస్ డిఫెన్స్ కాలనీలో అధికారులు సర్వే చేస్తున్నారు. రివర్‌బెడ్‌లో నిర్మాణాలకు మార్కింగ్ చేస్తున్నారు. ఇప్పటికే 13 వేలకుపైగా ఆక్రమణలను ప్రభుత్వం గుర్తించింది. అర్హులైన పేదలకు పునరావాసం కల్పించేందుకు వివరాలు సేకరిస్తున్నారు. మూసీ సుందరీకరణలో భాగంగా నదీ పరిసరాల్లో సుమారు 40వేల ఇండ్లు చెదిరి పోనున్నాయి. కాగా, ప్రాణాలైనా ఇస్తాం కానీ.. హైడ్రా బుల్డోజర్లను రానిచ్చేది లేదంటూ మూసీ పరీవాహక ప్రాంత వాసులు హెచ్చరించారు. తమకు డబుల్ బెడ్రూం ఇండ్లు అవసరం లేదని స్పష్టం చేసారు. రూపాయి రూపాయి పోగు చేసుకొని ఇల్లు కట్టుకున్నామని చెబుతున్నారు. మూసీ వెంట ఉన్నది అందరం లేబర్లమేనని, తమను తీసుకొని ఎక్కడో వేస్తే ఏం చేసుకొని బతకాలని ప్రశ్నించారు. డబుల్ బెడ్రూం అందజేసే ప్రక్రియకు నెలల తరబడి సమయం పడుతుందని, అప్పటి వరకు తాము ఎక్కడ ఉండాలి, ఎలా బతకాలని ప్రశ్నిస్తున్నారు. ఇన్నేండ్లలో ఎప్పుడు ఇలాంటి మనసులేని సీఎంను చూడలేదని వాపోతున్నారు. రేవంత్ రెడ్డికి తగిన బుద్ధి చెప్పే రోజులు వస్తాయని హెచ్చరించారు. మరోవైపు ఆపరేషన్ మూసీ పనులు జోరందుకున్నాయి. మూసీ ప్రక్షాళనపై రాష్ట్ర సర్కార్ స్పీడ్ పెంచింది.

## అధికారుల తప్పిదానికి సాక్ష్యం కాళేశ్వరం

(మొదటి పేజీ తరువాయి)

పంపి ఉంటే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదు. ఒక దేశం గొప్పతనాన్ని చెప్పేది ఆ దేశంలోని నిర్మాణాలు, కట్టడాలే అని సీఎం అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో నీళ్లు కీలకమైన అంశమని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. నీళ్లు మన జీవన విధానంలో ఓ భాగమని.. వ్యవసాయం, నీళ్లు తెలంగాణ ప్రజల భావోద్వేగమని అన్నారు. ఏఈఈలకు ఇది ఉద్యోగం కాదు.. భావోద్వేగమని వ్యాఖ్యానించారు. అధికారులు క్షేత్రస్థాయిలో తిరిగితే మంచి అవగాహన వస్తోందని.. క్షేత్ర స్థాయిలో తిరిగి నిర్ణయాలు తీసుకుంటే తప్పులు జరిగే అవకాశం తక్కువగా ఉంటుందని సూచించారు. నాణ్యత లోపిస్తే ప్రాజెక్టులు దీర్ఘకాలం నిలబడవని.. నాణ్యత లేకుంటే నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు ఇన్నేళ్లు ఉండేవి కావన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కట్టిన ప్రాజెక్టులు ఈ రోజు వరకు నిలబడ్డాయని అన్నారు.. ఐదేళ్ల ముందు మన కండ్లముందే కట్టిన కాళేశ్వరం ప్రాజెక్ట్ మాత్రం కూలిపోయిందని బీఆర్ఎస్‌పై ÷ర్ అయ్యారు. బీఆర్ఎస్ నేతలు గొప్పలు చెప్పిన మ్యాన్ మేడ్ వండర్ ప్రాజెక్ట్ కూలిపోయిందని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అంచనా వ్యయం ఎందుకు పెరిగిందని ప్రశ్నించారు. తప్పులు చేయకుండా ఉండేందుకు కొత్తగా ఎన్నికైన వాళ్లకు కాళేశ్వరం ఓ ప్రయోగశాలగా అభివర్ణించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో చర్యలు తీసుకుంటే అసలు ఇరిగేషన్ డిపార్ట్ మెంటే ఉండదని కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వం రూ.2 లక్షల కోట్లు సాగునీటిపై ఖర్చు చేసి ప్రాజెక్టులు పూర్తి చేయలేదని ధ్వజమెత్తారు.

## ఫార్మా సిటీ రద్దు వెనుక వేల కోట్ల కుంభకోణం

(మొదటి పేజీ తరువాయి)

దీంతో ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మా సిటీ రద్దు కాలేదు.. అట్లనే ఉందని నిన్న హైకోర్టులో పిటిషన్ వేసింది. నేను ఈ ప్రభుత్వాన్ని ఒక్కటే సూటిగా అడుగుతున్నా.. సీఎం ఎక్కడ మాట్లాడినా ఉన్న సిటీ గురించి మాట్లాడడం లేదు. ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, ఫోర్త్ సిటీ అని మాట్లాడుతున్నాడు. సీఎం రేవంత్ రెడ్డి చెప్పు చేతనైతే.. నీ భాషలో చెప్పాలంటే మొగోడివి అయితే చెప్పు.. నీవు చెప్పే ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ కోసం ఒక్క ఎకరమైనా భూసేకరణ చట్టం కింద సేకరించావా..? మీరు ఒక్క ఎకరం భూమి సేకరించకపోతే, మేం గతంలో ప్రతిపాదించిన ఫార్మా సిటీ భూమే అయితే దాన్ని ఇతర అవసరాలకు ఎలా మళ్లిస్తావు..? చివరకు న్యాయమూర్తులను కూడా తప్పుదోవ పట్టిస్తున్నావు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారు అని కేటీఆర్ తెలిపారు. నువ్వు గతంలో చెప్పిన మాట ప్రకారం.. ఫార్మా సిటీని రద్దు చేసిన మాట నిజమే అయితే.. ఆ భూములను రైతులకు తిరిగిచ్చే పని చేయ్. అలా కాకుండా ఫోర్త్ సిటీ కడుతా.. ఫిఫ్త్ సిటీ కడుతా.. మా ఫోర్ బ్రదర్స్‌కు రియల్ ఎస్టేట్ దందాకు వాడుతా అంటే రైతులు ఊరుకోరు. ఏ రైతులైతే నీకు ఓటేశారు.. వారే నీ పార్టీ అంతు చూస్తారు. రేపు ప్రభుత్వం కోర్టులో స్పష్టంగా చెప్పాలి. లక్షలాది మందికి ఉపాధి కల్పించే ఫార్మా సిటీ కడుతున్నారా..? లేదా..? అదే విధంగా కోర్టు కూడా నోటీసు చేయాలని న్యాయమూర్తులకు విజ్ఞప్తి చేస్తున్నాను. ఫార్మా సిటీ కోసం ఏడేండ్లు కష్టపడి రైతులను ఒప్పించి, మెప్పించి.. నానా తంటాలు పడి సేకరించిన 14 వేల ఎకరాల్లో 64 వేల కోట్ల పెట్టుబడులు రావాలని లక్షలాది మంది ఉద్యోగ ఉపాధి అకాశాలు రావాలని ఫార్మాసిటీని ప్రతిపాదించామని కేటీఆర్ తెలిపారు. ఫార్మా సిటీ కోసం ఆనాడు సేకరించిన 14 వేల ఎకరాలు కండిషనల్ ల్యాండ్ అక్విజిషన్ కింద తీసుకున్నాము. అంటే ఫార్మా సిటీ కోసమే మేము తీసుకుంటున్నాము అని స్పష్టంగా జీవోలో పేర్కుంటూ ఫార్మా సిటీ కోసం భూములను తీసుకున్నాం. ఇవాళ ఆ భూములను రియల్ ఎస్టేట్ దందా కోసం, ఫ్యూచర్ సిటీ అనే డ్రామాల కోసం, ఫోర్త్ సిటీ అనే హంగామా కోసం, ఏఐ సిటీ అనే హడావుడి కోసం మళ్లించి దాంట్లో నుండి వేల కోట్లు నొక్కేయాలనే ఆలోచన ప్రభుత్వం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇది పక్కా రియల్ ఎస్టేట్ స్కాం.. దీన్ని న్యాయమూర్తులు గమనించాలని కోరుతున్నాను. భూ దందాలను తప్పకుండా బయటపెడుతాం. ఫార్మా సిటీ విషయంలో ప్రభుత్వాన్ని అడుగుతున్నా.. ఫార్మా సిటీని కొనసాగిస్తే 14 వేల ఎకరాల్లో ఉండాలి లేదా రద్దు చేస్తే ఆ భూమి రైతులకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాను అని కేటీఆర్ పేర్కొన్నారు. ఇప్పుడు అహంకారంతో అడ్డగోలుగా అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్న అధికారులకు శిక్ష తప్పదు.. రిటైర్ అయినా రికవరీ చేయించే బాధ్యత తానే తీసుకుంటానని కేటీఆర్ హెచ్చరించారు. అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకుల్లా, కార్యకర్తల మాదిరి అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చిన్న చిన్న పల్లెలను గ్రామపంచాయతీలుగా మార్చి 54 కొత్త రేషన్ దుకాణాలు ఏర్పాటు చేశాం. ఆ రేషన్ దుకాణాలను స్థానికంగా ఉండే పొదుపు సంఘాలకు అప్పజెప్పాం. తద్వారా వారికి కొంత ఆదాయం వస్తదని అప్పజెప్పాం. మరి నువ్వేం చేశావు. ఇక్కడున్న కాంగ్రెస్ నాయకుడు తానే రాజు, తానే మంత్రి అన్నట్టు.. నేనే ప్రభుత్వాన్ని నడుపుతున్న అన్నట్టు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆయనకు అధికారులు వంతపాడుతూ ఆగమాగం అవుతున్నారు. మొన్న ఏపీలో ఏం జరిగిందో చూడండి.. ఆలిండియా సర్వీస్ ఆఫీసర్లు కూడా సస్పెండ్ అయ్యారు. చట్టం ప్రకారం కాకుండా ఇష్టమొచ్చినట్టు చేస్తాం అంటే తప్పకుండా ఫలితం అనుభవిస్తారు. ఆలిండియా సర్వీసు ఆఫీసర్లు, పోలీసులు, ఆర్డీవోలు, కలెక్టర్లు ఎవరైనా ఫలితం అనుభవిస్తారు. చట్టం ప్రకారం, ఒళ్లు దగ్గర పెట్టుకోని పని చేయండి. ఇష్టమొచ్చినట్లు చేస్తామంటే ఊరుకోం. మరో నాలుగేండ్లలో మళ్లీ కేసీఆర్ తిరిగి వస్తరు.. మీ సంగతి తప్పకుండా చూస్తాం అని కేటీఆర్ హెచ్చరించారు. కలెక్టర్, ఆర్డీవోను అడుగుతున్నా.. 54 రేషన్ దుకాణాలకు 480 మంది దరఖాస్తు చేసుకున్నారు. పారదర్శకత పాటించకుండా లక్షల రూపాయాలకు ఆ పోస్టులను అమ్ముకున్నారని కాంగ్రెస్ నాయకులే ప్రెస్‌మీట్లు పెట్టి ఆరోపిస్తున్నారు. అర్హత ఉన్న బాధితులేమో వాటర్ ట్యాంక్‌లు ఎక్కి నిరసన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్‌ను, స్థానిక మంత్రులను ఈ విషయంలో సూటిగా అడుగుతున్నా.. రాతపరీక్ష పెట్టామని అంటున్నారు కదా.. మెరిట్ లిస్ట్ బయటపెట్టండి.. వెంటనే జాబితా ప్రకటించండి. పీజీలు, డిగ్రీలు చదువుకున్నోళ్లకు మార్కులు రావట. పదో తరగతి పాసైన వారికి మార్కులు వస్తాయట.. కాంగ్రెస్ కండువా కప్పుకుంటే, లక్షలు సమర్పించుకుంటే మార్కులు వస్తాయట. ఇంత దిక్కుమాలిన రాజకీయాలు చేస్తారా..? లక్షల రూపాయాలకు పోస్టులను అమ్ముకుంటారా..? మళ్లీ మా టైం వస్తది.. తప్పకుండా అధికారులకు శిక్ష పడుతది. రిటైర్ అయినా రికవరీ చేయిస్తాం.. అతి చేసే వారికి మిత్తితో సహా చెల్లిస్తాం. రేషన్ దుకాణాల బాధితుల తరపున హైకోర్టును ఆశ్రయిస్తాం అని కేటీఆర్ స్పష్టం చేశారు.

## శృతి మించుతున్న డిజె శబ్దాలు

### - పండగలు పబ్బాల్లో కంట్రోల్ తప్పుతున్నారు

### - రౌంట్ టేబుల్ సమావేశంలో కమిషనర్ సివి ఆనంద్

**తెలంగాణ వీణ/హైదరాబాద్,సెప్టెంబర్26:** డీజే శబ్దాలు శృతిమించిపోతున్నాయని.. వాటిని కట్టడి చేయాల్సి ఉందని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ అన్నారు. మతపరమైన ర్యాలీల్లో డీజేపీలు, టపాసుల వినియోగంపై ఆయన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లు హాజరయ్యారు. అలాగే రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే రాజాసింగ్‌తో పాటు ఎంఐఎం పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. డీజే శబ్దాలపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయన్నారు.డీజేలతో నివాసాల్లో వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని.. గుండె అదురుతుందని ఆందోళన చెందుతున్నారన్నారు. రానురాను డీజే శబ్దాలు శృతి మించిపోతున్నాయని.. గణెశ్ ఉత్సవాలతో పాటు మిలాద్ ఉన్ నబీ సమయంలోనూ డీజేలతో నృత్యాలు విపరీతమయ్యాయన్నారు. పబ్‌లలో నృత్యాలు చేసినట్లు ర్యాలీల్లో చేస్తున్నారనన్నారు. ఈ డీజేలను నియంత్రించకపోతే ఆరోగ్యాలు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. ఆరోగ్య సమస్యలతో పాటు భద్రతకు సైతం ముప్పు ఉందన్నారు. డీజే శబ్దాలను కట్టడి చేయాలని అనేక సంఘాలు ఫిర్యాదు చేశాయన్నారు. ఈ క్రమంలోనే అందరి అభిప్రాయాలను తీసుకునేందుకు రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశామని.. అందుకే అన్ని వర్గాలను సమావేశానికి ఆహ్వానించామన్నారు. అందరి అభిప్రాయాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని.. ఆ తర్వాత సర్కారు చర్యలు తీసుకుంటుందని సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

తెలంగాణ వీణ
తెలంగాణ వీణ ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
8328209811

# బీసీ కుల సంఘాల సమైక్యతకు బహుజన వాదానికి పద్మశాలీల ముందడుగు



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** పద్మశాలీల ముందడుగు ..హర్షనీయమని , బడుగుల అడుగులకై నాడు బాపూజీ మొదలు నేడు యావత్ పద్మశాలీల సమాజం కదం తొక్కడం ఉద్యమానికి ఊపిరిఅని బీసీరాజకీయ ప్రజా ప్రతినిధులు కుల సంఘాల ఐక్యవేదిక ప్రముఖులు ముక్తకంఠంతో పేర్కొన్నారు గురువారం హైదరాబాద్ నారాయణగూడ పద్మశాలి భవనంలో అఖిలభారత పద్మశాలి రాజకీయ విభాగం జాతీయ అధ్యక్షులు బొల్ల శివశంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బీసీ కుల సంఘాల ఐక్యత రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య, మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ఎమ్మెల్సీ ఎల్ రమణ, అఖిలభారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షులు కందగట్ల స్వామి, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమర్తపు మురళి, లతో పాటు 103 కుల సంఘాలకు పైగా ప్రతినిధులు, పద్మశాలి కుల పెద్దలు పాల్గొన్నారు.. ఈ సందర్భంగా బీసీ కుల సంఘాల ఐక్యతకు జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ని ఏర్పాటు చేయాలని వారంతా తీర్మానం చేశారు ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం లో ఓసిల చివరి సీఎం రేవంత్ రెడ్డి అని రాబోయే 2028 ఎన్నికల్లో బీసీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని పేర్కొన్నారు బీసీల రాజ్యాధికారం కోసం బీసీ నాయకులంతా ఐక్యం కాకుంటే బలగం సినిమాలోనీ కుటుంబంల ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ ఆత్మకు క్షోభిస్తుందని అన్నారు రానున్న ఎన్నికల్లో బీసీ ఓట్లు లేకుండా ఓసీలు గెలుస్తారా అంటూ సవాల్ విసిరారు. దమ్ముంటే రానున్న ఎన్నికల్లో ఓసీలు నాకు ఓట్లు వేయకండి, మీరు కూడా నాల సవాల్ చేస్తారా బీసీ ఓట్లు లేకుండా మీరు గెలుస్తారా అంటూ ఓసి నాయకులకు వేదిక మీది నుండి రాజకీయ సవాల్ విసిరార్. స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలైనా బీసీలకు రాజ్యాధికారం దక్కలేదని ఒక్క మారు బీసీ ముఖ్యమంత్రి కాలేదని రాజ్యమేలుతున్నదంత ఓసి లేనని విమర్శించారు . 1952 నుండి 2023 వరకు ఐదు మంది బీసీలే ఎమ్మెల్యేలు కావడం బీసీల దౌర్భాగ్యం అని నేడు అసెంబ్లీలో 14 మంది ఓసి మహిళలు ఉన్నారని, ఇప్పటికైనా బీసీలంతా మేల్కొనాలని బీసీల రాజ్యాధికారం కోసం ఐక్యమై పోరాడుదాం అని తీన్మార్ మల్లన్న పిలుపునిచ్చారు. : కులగణన ప్రక్రి యను ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం నిర్వహిం చుకుంటే మంచిదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కొన్ని కులాలు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో కేటగిరిలో ఉన్నాయని, ఓ రాష్ట్రంలో ఓసీ అనుకున్న కులం మరో రాష్ట్రంలో బీసీగా పరిగణిం చబడుతున్నందున, జనగణన సంపూర్ణం గా రాష్ట్ర ప్రభుత్వాలే చేపట్టి కులాల వారీగా లెక్కలు బయటకు తీయాలని అభిప్రాయపడ్డారు. అలా చేస్తే కోర్టులు కూడా అడ్డు చెప్పే ఆస్కారం ఉండదని, తమిళనాడు ఇష్యూ గురించి చదివిన వ్యక్తిగా చెబుతున్నానన్నారు. మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లా డుతూ.. ప్రస్తుతం మతం, కులం, జాతీయత దాస్తే దాగేవి కావని, ఎవరు ఒప్పు కున్నా ఒప్పుకోకపోయినా ఈ దేశంలో ఇంకా కులం అనేది ఉన్నదనేది వాస్తవ మన్నారు. అణగారిన జాతుల హక్కుల కోసం ఆర్. కృష్ణయ్య చేస్తున్న పోరాటాన్ని అభినందిస్తున్నానని పేర్కొన్నారు. ఆయన పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు.

**స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే బీసీ రిజర్వేషన్లు పెంచాలి: ఈటల...**

స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే బీసీ రిజర్వేషన్లు పెంచాలని ఈటల డిమాండ్ చేశారు. ఈ డిమాండ్కు తాము సంపూర్ణంగా మద్దతు ఇస్తున్నామని స్పష్టం చేశారు. అన్ని పార్టీలు మొదట బీసీలకు సముచిత స్థానం కల్పించి చూపించాలన్నారు. తనకు తెలిసి ఈ దేశంలో మొట్టమొదటి సారి ఓబీసీల కేంద్ర మంత్రుల సంఖ్య ఎక్కువ ఉన్నది నరేంద్ర మోడీ కేబినెట్ లోనేనని చెప్పారు. తెలం గాణలో ఇప్పటివరకు ఓబీసీ ముఖ్యమంత్రి కాలేకపోయారన్నారు. ప్రజలు ఆశీర్వదిస్తే తాము ఓబీసీ వ్యక్తిని సీఎం చేస్తామని మోడీ ప్రకటన చేశారని ఈటల గుర్తు చేశారు. బీసీ హక్కుల సాధనకై ఆర్ కృష్ణయ్య రాజీనామా చారిత్రాత్మకమని ఎమ్మెల్సీ ఎల్ రమణ పేర్కొన్నారు. బీసీల హక్కుల సాధన కోసం అఖిల భారత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ నిర్మాణం చేసిన భవనంలో తొలి అడు గువేయడం హర్షణీయమన్నారు,. బీసీ హక్కుల సాధన కోసం, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం, బడుగుల ఆత్మగౌరవం కోసం తన పదవిని సైతం తృణప్రాయంగా విడిచిపెట్టిన మహానీయులు కొండ లక్ష్మణ్ బాపూజీ అని ఆయన ఆశయ సాధనలో మేము సైతం పద్మశాలీలమని ఆయన పేర్కొన్నారు . బీసీల ఐక్యత కోసం నేడు ఏర్పాటు చేసిన సదస్సు తొలి నాంది అని రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున బీసీ సదస్సులు ఏర్పాటు చేసి రాజ్యాధికారం దిశగా అడుగులు వేద్దామని బీసీ కుల సంఘ నేతలకు పిలుపునిచ్చారు.. బీసీల రాజ్యాధికార ఉద్యమానికి బీసీలంతా ఐక్యం కాకుంటే బాపూజీ ఆత్మకు శోభిస్తుందని అఖిలభారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షులు కందగట్ల స్వామి పేర్కొన్నారు. బీసీల ఐక్యత సాధన కోసం ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ ఎంతో కృషి చేశారని ఆయన ఆశయ సాధనే ధ్యేయంగా పద్మశాలీలంతా బీసీ ఐక్య సాధనలో ముందు ఉంటారని ఆయన పేర్కొన్నారు. బీసీల రాజ్యాధికార ఆశయ సాధనకై పద్మశాలీలంతా ఐక్యతతో కలిసి పోరాడుదాం అని అఖిలభారత పద్మశాలి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలంతా ఐక్యంగా ఉండి తమ వాటా సాధించుకుందామని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమర్తపు మురళి పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని 103 కుల సంఘాలకు పైగా బీసీ సంఘాలు సమిష్టిగా ఉండి మన హక్కులు సాధించుకుందామని ఆయన పేర్కొన్నారు. 13 కుల సంఘాలకు పైగా పాల్గొన్న కుల సంఘాల నేతలు బీసీల రాజ్యాధికారం కోసం ఒక జేఏసీని ఏర్పాటు చేద్దామని తీర్మానం చేశారు నాయకులంతా బీసీల అణిచివేతకు గురవుతున్నారని బీసీలంతా ఐక్యంగా ఉండి బీసీ రాజ్యాధికార సాధన కోసం కృషి చేద్దామని వారంతా పేర్కొన్నారు ఈ కార్యక్రమానికి ముందు ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన ఆశయాలు సాధించుకుందామని నినాదాలు చేస్తూ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అవ్వారి భాస్కర్ వాసాల రమేష్ , బోనం వుర్మిల వనం, దుశ్యాంతల గుంటక రూప కందగట్ల బిక్షపతి, వనం విశ్వనాథం గుర్రం శ్రవణ్ జే ల్లా నరేందర్, బిల్ల దీపిక బొమ్మ ప్రవల్లిక కొక్కుల దయానంద్, మెతుకు సత్యం, సినిమా హీరో వైభవ్, డాక్టర్ మమత, బొమ్మ అమరేందర్, చిన్ని రాకేష్, విజయలక్ష్మి 103 పైగా కుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళికతో ముందుకు వెళ్తున్నా..

- 24న సీఎం రేవంత్ రెడ్డిని కలిసాను
- ఇచ్చిన ప్రతీ రీప్రజెంటేషన్ పై సానుకూలంగా స్పందించారు
- త్వరలోనే ప్రభుత్వ ఉత్తర్వులు రానున్నాయి..
- నవంబర్‌లో సీఎం గారి చేతుల మీదుగా శంకుస్థాపనలు..
- శాసనసభా పక్షాలను విలీనం చేసుకున్నప్పుడు గుర్తుకు రాలేదా ప్రజాస్వామ్యం
- కోర్టులపై, కోర్టు తీర్పులపై గౌరవం ఉంది
- ఎన్నికలు రావు... వచ్చినా ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉంది



**తెలంగాణ వీణ/హనుమకొండ ప్రతినిధి, సెప్టెంబర్ 26:** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ అభివృద్ధికి ఎజెండా పెట్టుకొని ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలు నాపై నమ్మకంతో బ్రహ్మాండమైన మెజారిటీ అందించారాని అన్నారు. కడియం శ్రీహరి ఎమ్మెల్యే గా ఉంటే అభివృద్ధి, పరిపాలన సజావుగా ఉంటుందనే ఎవరెన్ని విమర్శలు చేసినా, పరోక్షంగా ఓడించాలని చూసినా ప్రజలు నాకు ఓటు వేసి గెలిపించారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉన్నానని అన్నారు. ఈ నెల 24న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి నియోజకవర్గ అభివృద్ధి పై చేర్చినట్లు తెలిపారు. ఇచ్చిన ప్రతీ రీప్రజంటేషన్ పై సానుకూలంగా స్పందించారాని వివరించారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం వెనకబడిన నియోజకవర్గంగా, పేద ప్రజలు అధికంగా ఉన్న నియోజకవర్గంగా ఉందని అన్నారు. గత 10ఏళ్లలో నియోజకవర్గంలో రాజకీయ అవినీతి, అక్రమాలు రాజకీయం అంటే పదవులు, పథకాలు అమ్ముకోవడం అనే విధంగా చేశారని, కాని ఇప్పుడు రాజకీయం అంటే సంక్షేమం, ప్రజా సేవ, నీతి నిజాయితీ అనే కొత్త నిర్వచనం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగానే నిజాయితీగా పని చేస్తూ రూపాయి ఆశించకుండా అవకాశాలు కల్పిస్తానని తెలిపారు. కష్టపడి పని చేసే వారికే పదవులు వస్తాయని స్పష్టం చేశారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో వైద్య సేవలు అందరికీ అందుబాటులోకి రావాలంటే 100పడకల అస్పత్రి నిర్మించాలని దానికి నిధులు, ఆర్టీసీ ల్యాండ్ అలాట్ మెంట్ చేయాలని కోరగానే సానుకూలంగా స్పందించిన సీఎం వెంటనే కలెక్టర్ కి ఆదేశాలు జారీ చేశారాని అన్నారు. రెవిన్యూ డివిజన్ ఏర్పాటు అయింది కాని కార్యాలయాలు లేవని చెప్పగానే సీఎం సానుకూలంగా స్పందించారాని అలాగే ఇంటిగ్రెటెడ్ స్కూల్ ఏర్పాటులో ఘనపూర్ నియోజకవర్గానికి అవకాశం కల్పిస్తానని చెప్పారని వెల్లడించారు. మేజర్ గ్రామ పంచాయతీ అయినా ఘనపూర్ ను మున్సిపాలిటీ గా అప్ గ్రేడ్ చేయాల్సిన అవసరం ఉందని చెప్పినట్లు తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను తప్పకుండా ఏర్పాటు చేయాలని చెప్పడంతో వెంటనే సంబంధిత అధికారులకు ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. నీటి పారుదల శాఖకు సంబంధించి తెలిపిన పనులన్నింటిని వెంటనే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. అలాగే నియోజకవర్గంలో రూ.100కోట్లు ఆర్ అండ్ బి రోడ్లకు, మరో రూ. 100కోట్లు పంచాయతీ రాజ్ రోడ్లకు కేటాయించాలని కోరినట్లు వివరించారు. చిల్పూర్, వేలేరు మండలాల్లో మండల కార్యాలయాల నిర్మాణానికి నిధులు మంజూరు ఇస్తానాని చెప్పినట్లు తెలిపారు. వీటన్నింటికి త్వరలోనే ప్రభుత్వ ఉత్తర్వులు రానున్నాయని, నవంబర్ నెలలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపనలు చేసుకోబోతున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను నాశనం చేసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారాని ఆరోపించారు. బిఆర్ఎస్ నాయకులు సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని శాసనసభా పక్షాలను విలీనం చేసుకున్నప్పుడు ప్రజా స్వామ్యం గుర్తుకు రాలేదా అని మండిపడ్డారు. కోర్టుల పైన గౌరవం ఉందని కోర్టు తీర్పుకు కట్టుబడి ఉంటామని అన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని దాని గురించి ఆలోచించాల్సిన అవసరం లేదని అన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలంగానే ఉందని తెలిపారు. నా 30ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటివి చాలా చూశానని అన్నారు. స్థాయిలేని మనుషుల గురించి నేను మాట్లాడానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో ఘన నివాళులర్పించిన కొన్నే సంపత్ రజక



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా గన్ పార్క్ అమరవీరుల స్తూపం వద్ద గల చాకలి ఐలమ్మ విగ్ర హానికి కి బిజెపి రాష్ట్ర నాయకులు కొన్నే సంపత్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొన్నే సంపత్ మాట్లాడుతూ గడీలపై గళమెత్తి భూ పోరాటానికి నాంది పలికిన ఐలమ్మ బహుజన ఆత్మగౌరవానికి, మహిళా చైతన్యానికి ప్రతీకగా నిలుస్తారని స్మరించుకున్నారు. పంజగారి ఆంజనేయు లు, పెద్దాపురం కుమారస్వామి, రాష్ట్ర మహిళా నాయకురాలు కొలుకులపల్లి రాధిక, సట్ల అంజలి, రేవల్లి నరేష్, సత్యనారా యణ, శంకర్, రాజు, గణేష్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఈటీవీ సీనియర్ జర్నలిస్టు ఆదినారాయణ మృతి

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి



**తెలంగాణ వీణ/హైదరాబాద్, సెప్టెంబర్ 26:** ఈటీవీ సీనియర్ జర్నలిస్టు హైదరాబాద్ బ్యూరో చీఫ్ టి.ఆదినారాయణ గురువారం ఉదయం అపార్టుమెంట్‌పై వాకింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారిపడ్డారు. దీంతో కుటుంబసభ్యులు ఆయన్ను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆదినారా యణకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సుమారు 25 ఏళ్లుగా ఈటీవీలో ఆయన పనిచేస్తున్నారు.కాగా, ఆయన మృతిపై తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆదినారాయణ అకాల మరణం దిగ్భ్రాంతి కలిగించిందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## డ్రగ్స్ కేసులో టాలీవుడ్ హీరో అభిషేక్ అరెస్ట్

**తెలంగాణ వీణ/హైదరాబాద్, సెప్టెంబర్ 26:** వరస వివాదాలతో తెలుగు ఇండస్ట్రీ వార్తల్లో నిలుస్తుంది.డ్రగ్స్, అమ్మాయిలపై అత్యా చార ఘటనలతో ఇండస్ట్రీ మొత్తం వివాదాల్లో నిలుస్తుంది. ఈ నేపథ్యంలోనే టాలీ వుడ్ ప్రముఖ నటుడు డ్రగ్స్ కేసులో గురువారం అభిషేక్ అరెస్ట్ అయ్యారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులు అభిషేక్ ను గోవాలో అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఆర్.నగర్, జూబ్లీహిల్స్ పీఎస్ పరిధిల్లో డ్రగ్స్ కేసు ల్లో అభిషేక్ నిందితుడిగా ఉన్నారు. ప్రస్తు తం ఈ కేసులపై దర్యాప్తు జరగుతుండగా.. బెయిల్ పై బయట ఉన్నారు. కానీ, కోర్టుకు హాజరు కావడం లేదు. హైద్రాబాద్ నుంచి గోవా వెళ్లి అక్కడే ఓ రెస్టారెంట్ నిర్వహిస్తున్నా రు. కోర్టు కు హాజరుకాకపో వడంతో న్యాయస్థానం అరెస్ట్ వారెంట్ జారీ చేసింది.ఈ వారంట్ తో తెలంగాణ న్యాబ్ పోలీసులు గోవాలో అభిషేక్ ను గురువారం రోజు అదుపులోకి తీసుకున్నారు.

## మండల విద్యాధికారికి సన్మానం

**తెలంగాణ వీణ/కోరుట్ల, సెప్టెంబర్ 26:** మెటుపల్లి మండల విద్యాధికారి గా నియమితులైన మేకల చంద్రశేఖర్ ను గురువారం తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు తుంగూరి సురేశ్, మండల శాఖ నవీన్ కుమార్, ప్రధాన కార్యదర్శి రాజ లింగం, రాష్ట్ర జిల్లా బాధ్యు లు మధుచందర్, రత్నాకర్, తాహె ర్ శేషశయన. ఉపాధ్యాయులు నంబి రాజేందర్ శర్మ తదితరులు విద్యాధికారిని సన్మానించారు. మండల స్థాయిలో పాఠశాలలో ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, మండల స్థాయిలో విద్యాభివృద్ధి కై తమ సేవలు వినియోగించాలని కోరారు.

## వీరనారి చాకలి ఐలమ్మకి నివాళులర్పించిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య





**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:**తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్,శాసన మండలి చైర్మన్ గుత్త సుఖేందర్ రెడ్డి తో కలసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య వీరనారి చిత్రపటానికి తెలంగాణ అసెంబ్లీ కార్యాలయంలో పూలమాల వేసి నివాళులు అర్పించారు. గడీలపై గళమెత్తి భూ పోరాటానికి నాంది పలికిన ఐలమ్మ బహుజన ఆత్మగౌరవానికి, మహిళా చైతన్యానికి ప్రతీకగా నిలుస్తారని బీర్ల ఐలయ్య స్మరించుకున్నారు.ర

## తమకు న్యాయం చేసి కూల్చండి...

**- న్యూ దుర్గా నగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీదారులు**




**తెలంగాణ వీణ,హైదరాబాద్:** అంబర్ పేట్ అలీ కేఫ్ చౌరస్తా వద్ద న్యూ దుర్గా నగర్ లో మూసి నది వెంట ఉన్న స్మాల్ స్కేల్ ఇండస్ట్రీ లకు అధికారుల మార్కింగ్ (రెడ్ కలర్ తో ఎం.అని మార్కింగ్) లు పెట్టడాన్ని ఇండస్ట్రీ యజమానులు ఆందోళన వ్యక్తం చేశారు. స్మాల్ స్కేల్ ఇండస్ట్రీ యజమానులు, దుకాణదారులు, వాటిలో పనిచేసే సిబ్బంది ధర్నా చేశారు. వారికి సిపిఎం పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు మహేందర్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు లింగా రావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఇండస్ట్రీ యజమానులు నాయకులు మాట్లాడుతూ తాము నిర్మించుకున్న దాంట్లో పట్టా భూములు కొనుక్కుని షెడ్లు, ఇండస్ట్రీ కట్టుకున్నామని పేర్కొన్నారు. అయితే అధికారులు వచ్చి ఇండస్ట్రీ గోడలపై గేట్లపై మార్కింగ్ వేసి వెళ్లారని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రత్యామ్నాయంగా తమకు డబ్బులు లేదా స్థలాలు ఇచ్చిన తర్వాతనే మేము ఖాళీ చేస్తామని తెలిపారు. ఇక్కడ చిన్నాచితక 200 చిన్న చిన్న ఇండస్ట్రీలు వరకు ఇక్కడ ఉన్నాయని వేలాదిమంది ఉపాధి పొందుతున్నారని వారిని రోడ్డు మీద పడేయవద్దని వాపోయారు. తమకు సిబ్బందికి ప్రత్యామ్నా యం చూపిన తర్వాతనే తమ నిర్మాణాల వద్దకు రావాలని డిమాండ్ చేశారు. ఈ ల్యాండ్ పై హైకోర్టులో స్టేటస్ కో ఉన్న కూడా తమ ఇండస్ట్రీ గోడలకు, గేట్లకు మార్కింగ్ పెడుతున్నారనీ కోర్టును కూడా ధిక్కరిస్తున్నారనీ వారు పేర్కొన్నారు.

## రజక సంఘాల ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి

**తెలంగాణ వీణ,కోరుట్ల, సెప్టెంబర్ 26:** మెట్ పల్లి పాత బస్టాండ్ వద్ద మెట్ పల్లి పట్టణ 5 రజక సంఘాల వారి ఆధ్వర్యంలో తెలంగాణ పోరాట వీరవనిత చాకలి ఐలమ్మ జయంతి పురస్కరించుకొని ఆమె విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా జయంతి వేడుక జరిపారు.ఈ సందర్భంగా పలువురు వ్యక్తులు మాట్లాడుతూ చాకలి ఐలమ్మ తెలంగాణ పోరాట వీర వనితని ఆమె చేసినత్యాగము ఉద్యమకారులకు మార్గదర్శకమని అన్నారు. పట్టణ ఐదు రజక సంఘాల అధ్యక్షులు వన్నెల శశి ,కలికోట వేణు, పిప్పెర రాజ్ కుమార్, వన్నెల సాయిలు, దొడ్డిపట్ల శ్రీనివాస్, రజక పట్టణ సంఘ సభ్యులు పాల్గొన్నారు

## మాణికేశ్వరి నగర్‌లో హాస్పిటల్ నిర్మించాలంటూ ఆరోగ్య శాఖా మంత్రిని దామోదర రాజనర్సింహాను కలిసి వినతిపత్రం..

**తెలంగాణ వీణ/తార్నాక:** తార్నాక మున్సిఫల్ డివిజన్ పరిధిలోని మాణికేశ్వర్నగర్లో ఆరోగ్య కేంద్రాన్ని నిర్మాణం చేయాలనీ విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం మాణికేశ్వర్నగర్కు చెందిన పలువురు నాయకులు సికింద్రాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదం సంతోష్ ఆధ్వర్యంలో గాంధీ భవన్లో తెలంగాణ ఆరోగ్య శాఖా మంత్రి దామోదర రాజనర్సింహాను కలిసి బస్తీలో ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించాలనీ వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం మాణికేశ్వర్ ్నగర్ను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. తమకు హాస్పిటల్ను నిర్మించాలని డిమాండ్ చేస్తూ దాదాపు 100 రోజులకు పైగా రిలే నిరాహార దీక్ష చేపట్టినా గత ప్రభుత్వం తమపై కనికరం చూపలేదన్నారు. ప్రస్తుత ప్రజాపాలన ప్రభుత్వంలో తమకు ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనీ కోరడంపై మంత్రి సానుకూలంగా స్పందించినందుకు మాణికేశ్వర్నగర్ వాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. మంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ వేముల శ్రీనివాస్, వి లాజరస్,లింగయ్య,జి వెంకటేష్,వరికుప్పల రావి,అశోక్ తదితరులు పాల్గొన్నారు.





## ఓయూలో ఘనంగా వీరనారి చిట్యాల ఐలమ్మ జయంతి ఉత్సవాలు

**తెలంగాణ వీణ/ఓయూ:** ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల వేదిక చైర్మన్ కంచర్ల బద్రి అధ్యక్షతన ఈరోజు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్. కొండా నాగేశ్వరరావు,ప్రొ. వంశీధర్ సార్ మరియు డాక్టర్ కోటేష్, హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కొండ నాగేశ్వరరావు మాట్లాడుతూ చాకలి ఐలమ్మది తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం లో ఎనలేని త్యాగమని, ఆ పోరాటం లో తన కుటుంబంతో సహా సర్వం కోల్పోయిన వెనకడుగు వేయలేదని పేర్కొన్నారు. ఈ మధ్యకాలంలో తెలంగాణ ప్రభుత్వం కోటి ఉమెన్స్ కాలేజీకి వీరనారి చిట్యాల ఐలమ్మ పేరు పెట్టడం హర్షనీయమని అన్నారు. ఐలమ్మ పోరాట చరిత్రను పాఠ్యాంశం



పెట్టాలని ,ఐలమ్మ స్ఫూర్తిని విద్యార్థులు ముందుకు తీసుకుపోవాలని గుర్తు చేశారు. వివిధ విద్యార్థి సంఘాల నాయకులు అమరుల లక్ష్యసాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు సనుగుల రంజిత్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు.మూర్తి, పీడీ ఎస్ యు ఓయు అధ్యక్షులు సుమంత్, టి ఎస్ ఏ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ ఎం శ్రీకాంత్,ఏ ఎం ఎస్ ఏ అధ్యక్షులు నామ సైదులు, ఓయూ జేఏసీ దర్శనం జాన్,అంజనేయులు, తెలంగాణ మహిళా ఉద్యమ నాయకురాలు లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉద్రిక్తతల మధ్య వీరనారి

**- చాకలి (చిట్యాల) ఐలమ్మ 129వ జయంతి**

**- ఘనంగా నివాళులర్పించిన బీసీ నాయకులు**

**తెలంగాణ వీణ/మల్కాజిగిరి:** చిట్యాల ఐలమ్మ 129వ జయంతి సందర్భంగా గురువారం గౌతమ్ నగర్ డివిజన్ లోని జ్యోతి నగర్ దోబీ ఘాట్ లో రజక సంఘం కార్యదర్శి కాసర్ల నాగరాజు అధ్యక్షతన వీర తెలంగాణ సాయుధ పోరాటాన్ని రగిల్చిన అగ్ని కణం చిట్యాల ఐలమ్మ జయంతి నిర్వహించారు, జిహెచ్ఎంసి కమిషనర్, సిఐ కు ఐలమ్మ జయంతి జరుగుతున్నట్టు తెలపడం జరిగింది, మీ రజక సంఘం ఆధ్వర్యంలో జయంతి జరుపుకోవడానికి మాకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారు, ఎవరో దుండగులు 100కు డయల్ చేయడంతో పోలీసు వారు ఈ కార్యక్రమానిన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించారు, తర్వాత సిఐ జిహెచ్ఎంసి అధికారులు వచ్చి జయంతిని నిర్వహించుకోవడానికి అనుమతి ఇచ్చారు, ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కామల్ల ఐలన్న పాల్గొని మాట్లాడుతూ వీరనారి



ఐలమ్మ భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం దున్నే వాడికె భూమి కోసం, చేసిన పోరాటం చరిత్రలో నిలిచిందన్నారు, చిట్యాల అయిలమ్మ స్ఫూర్తితో 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారని, తెలంగాణ రైతంగా సాయుధ పోరాటంలో 4500 మంది పోరాట యోధులు అమరులయ్యారని, ఆ పోరాట స్ఫూర్తితో గతంలో ఉన్న దోబీ ఘాట్ ను రజకులకు వచ్చే విధంగా రజకులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి మద్దతు పలుకుతు బీసీ కులాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ తరపున కూడా పోరాటాలు నిర్వహిస్తామని ఐలన్న తెలిపారు, ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షులు జి.పాండు, బీసీ కులం ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రొయ్యల కృష్ణమూర్తి, రాష్ట్ర నాయకులు బత్తిని నరసింహ గౌడ్, పిట్టల భాస్కర్, పేపర్ శ్రీనివాస్, చుక్క సుధాకర్, జోగు శ్రీనివాస్, రజక సంఘం నాయకులు ఆర్ సత్యనారాయణ, వి.ప్రవీణ్ కుమార్, కే.శ్రీకాంత్, వి.సతీష్, ఏ.తిరుపతి, ఆర్.యాదగిరి, ఆర్.శంకర్, ఆల్ పార్టీ నాయకులు రామచంద్రం, టీ.యాదయ్య గౌడ్, సిద్ధిరాములు, కె.శంకర్ ఏం.బాబు, అజీజ్, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని చిట్యాల ఐలమ్మ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

## బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి

**- పద్మశాలి సమాజానికి మార్గదర్శకులు కొండంత అండ: ఆచార్య కొండ లక్ష్మణ్**

**- బాపూజీ ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా తెలంగాణ పద్మశాలి నేతకు జేజేలు అంటూ ఒక పాట రచన మిరియాల లక్ష్మి**

**-యాదగిరిగుట్ట జై మార్కండేయ జై జై పద్మశాలి**

**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:** సూరి నీవల్లే వెలుగై వెలిగినావయ్య నింగిలోని చుక్క వై నిలిచినావయ్య తెలంగాణకై పోరాటం చేసిన వయ తెలంగాణ గెలుపుకై కలలెన్నో కన్నావయ్యా ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీకి జోహార్లు తెలంగాణ పద్మశాలి నేతకు జేజేలు పరుల కొరకు పాటు పడ్డావయ్య పరోప కారమే చేసినావయ్య పద్మశాలి పట్టు పరిశ్రమకు ప్రఖ్యాతి తెచ్చినా వయ్య పద్మశాలీలకు మార్గం చూపిన వాయ్య మా మదిలోన నిలిచి నావయ్య ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీకి జోహార్లు తెలంగాణ పద్మశాలి నేతకు జేజేలు చేనేత చైతన్యం చేకూర్చిన వయ్యా చేయి చేయి కలిపి అందరూ కదలాలని చెప్పినా వయ్య బడుగు బలహీన వర్గాలకు అభివృద్ధి చేసినావయ్యా బడుగు బలహీన వర్గాలకు ఆశ జ్యోతి వై నిలిచినా వయ అందరి కోసం అహర్నిశలు శ్రమించినావయ్య అందరి ఎదగాలని నీ ఆకాంక్షయ్య అందరూ నిన్ను బాపూజీ అని కొనియాడినారయ్యా మంత్రి పదవి వదులుకొని తెలంగాణ స్వాతంత్రానికి సారధివై సమరం సాగించినావయ్య విజయ బేరి మ్రోగించి విజయం సాధించినా వయ్య స్వాతంత్ర సమరయోధుడువై నిలిచినావయ్య కొండ లక్ష్మణ్ బాపూజీకి జోహార్లుతెలంగాణ పద్మశాలి నేతకు జేజేలు.





# ఐలమ్మ పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం: కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి..బండి రమేష్

**తెలంగాణవీణ/కూకట్ పల్లి:** పోరాడితే పోయేదేమీ లేదు అంటూ, తెగువ చూపిన చాకలి అయిలమ్మ ను స్ఫూర్తిగా తీసుకుని, నేటి యువత ,మహిళలు ముందుకు సాగాలని కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట ప్రతీక వీరనారి చాకలి ఐలమ్మ 129వ జయంతి సందర్భంగా, కూకట్ పల్లి మూసాపేట్ లోని రజక సంఘం అధ్యక్షులు నోముల సుందర్ ఆధ్వర్యంలో, నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, స్థానిక నాయకులతో కలిసి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు, ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీర నారి ఐలమ్మ అంటూ కొనియాడారు, రైతాంగ సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ పోరాటస్ఫూర్తి భావితరాలకు ఆదర్శమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి కోటి లోని మహిళా కళాశాలకు ఆమె పేరు పెట్టడం మహిళల పట్ల ఉన్న గౌరవభావాన్ని తెలియజేస్తుందన్నారు.



అనంతరం అక్కడి ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ



కార్యక్రమంలో లక్ష్మయ్య, నాగిరెడ్డి, తూము వేణు, వెంకటేశ్వరరావు, ప్రతాప్ రెడ్డి, కర్క పెంటయ్య , రఘు ,పుష్ప రెడ్డి, , నయీమ్, సతీష్ గౌడ్ ,చున్ను పాషా , సుధాకర్, ప్రకాష్, జమీర్ , షకీల్ ,అరుణ్, సచిన్, శివ చౌదరి ,బచ్చుమల్లి సంధ్య, జోజమ్మ, కర్రమ్మ , తదితరులు పాల్గొన్నారు.

# అధికారులతో సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**తెలంగాణవీణ/కూకట్ పల్లి:** నియోజక వర్గంలో ప్రజలకు ఎక్కడా కూడ ఇబ్బందులు కలగకుండా, మంచినీళ్లు, డ్రైనేజీ,రోడ్ల మరమ్మత్తు పనులు చేపట్టాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు, కూకట్ పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, ఇంజనీరింగ్ అధికారులు,వాటర్ వర్క్స్ అధికారులతో కలసి ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ, కూకట్ పల్లి నియోజక వర్గంలో మొన్న వచ్చిన భారీ వర్షాల కారణంగా, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతిన్నాయి.మంచినీటి పైప్ లైన్ సరిగా లేకపోవడంవల్ల నీళ్లు రావడం లేదని, పిర్యాదులు అందాయని ఎమ్మెల్యే అన్నారు. అధికారులు అందరు రాబోయే పండుగలు దృష్టిలో పెట్టుకొని రోడ్లు,డ్రైనేజీ,మంచినీటి వ్యవస్థ పనులు




ముమ్మరం చేయాలన్నారు, అదే విధంగా నూతన రోడ్లు, డ్రైనేజ్ మంచినీటి వ్యవస్థ వేయడానికి కావలసిన నిధుల కోసం అంచనాలను తయారు చేయాలని అధికారులకు ఆదేశాలను జారీ చేశారు, బతుకమ్మ పండుగకు రంగదాముని చెరువు వద్ద కావల సిన ఏర్పాట్లను అధికారులు సమన్వయం చేసుకొని ఆడపడు చులకు ఎలాంటి ఆటంకాలు జరగకుండా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబురావు ఇంజనీరింగ్ ఈఈ గోవర్ధన్, శ్రీనివాస్, డిఈలు శ్రీదేవి ,శంకర్, ఏఈలు మరియు వాటర్ వర్క్స్ జిఎం ప్రభాకర్ డీజీఎంలు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**తెలంగాణ వీణ/నాచారం:**జిల్లా పరిషత్ హై స్కూల్లో 1977-78 సంవత్సరం పదవ తరగతి చదివిన విద్యార్థినీ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఎమ్మెల్యే రిక్రేయేషన్ క్లబ్ జూబ్లీహిల్స్ లో ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా బంధారపు లింగస్వామి, ముఖ్య అతిథిగా కే రవీందర్ రెడ్డి, అతిథిగా విశ్రాంత పిఈటి చంద్రమౌళి పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులు దాదాపు 45 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. నాడు పాఠశాలలో గడిపిన మధుర స్మృతులను, జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని సంతోషంగా గడిపారు. ఇక్కడ చదివిన విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి దేశ, విదేశాల్లో అత్యున్నత స్థానాల్లో స్థిరపడ్డారు. నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సాదరంగా ఆహ్వానించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆత్మీయ మిత్రులు మాట్లాడుతూ.. 45 సంవత్సరాల తరువాత తమను పిలిపించి ఇంతటి తీపి జ్ఞాపకాలను తిరిగి



ఆస్వాదించేలా చేయడం, ప్రతి మిత్రుడు ఉన్నత స్థానంలో ఉండడం చాలా సంతోషంగా ఉందనారు.అనంతరం పూర్వ విద్యార్థులు తమ తోటి మిత్రులను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి మెమొంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు డాక్టర్ పి. బాలశౌరి, కె నాగిరెడ్డి విశిష్ట అతిథులుగా దంతూరి సత్తయ్య గౌడ్, పోలు నాగయ్య గౌడ్,వి



శ్రీధర్ రావు, వి రవీందర్, ఎం.యాదయ్య, భాను ప్రకాష్ రెడ్డి,బి.బిక్షపతి, బి శ్రీరంగం,డా ఎన్.శంకర్, డా రాజ మల్లేశం,ఎం డి. అబ్దుల్ సమద్,ఎం డి ఇస్మాయిల్,ఎస్ డి. బక్షెల్లి,ఎన్ మారయ్య, లక్ష్మీబాయి, అరుణ, శోభ రాణి, పద్మ, మొదలగు వారి తోపాటు ఈ కార్యక్రమంలో 43 మంది హాజరై తమ సుఖ దుఃఖాలను పాలుపంచుకున్నారు.

# రేషన్ కార్డుల ఈ-కేవైసీ ప్రక్రియను ఇంటి వద్దనే చేయాలి



**తెలంగాణ వీణ/తార్నాక:** రేషన్ కార్డు జారీలో ప్రభుత్వం చేపడుతున్న ఈ కేవైసీ ప్రక్రియను ఇంటి వద్దనే చేపట్టాలనీ స్వేరోస్ హైదరాబాద్ కార్యదర్శి కుమార్ షాను డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన తార్నాకలో విలేకరులతో మాట్లాడుతూ 70 ఏళ్లు పై బడిన వృద్ధులు, వికలాంగులు, వివిధ కారణాలతో పేషంట్లుగా మారి ఇంటి వద్దనే ఉంటున్న వారు రేషన్ దుకాణాల వద్దకు వచ్చే పరిస్థితి లేదన్నారు. దీంతో పాటుగా తమ ప్రాంతంలో కొందరు బ్రెయిన్ డెడ్ పేషంట్లు ఉన్నారు. వీరందరికి ఈ కేవైసీ లేక రేషన్ కార్డులు రద్దు అయ్యే ప్రమాదం ఉందన్నారు. ఒక వైపు ప్రభుత్వం ఈ కేవైసీ అప్డేట్ చేసుకోకపోతే రేషన్ కార్డులను తొలగిస్తామని అంటున్నారు. కావునా ఈ లాంటి పేద, మద్యతరగతి కుటుంభాలకు ప్రభుత్వం ఆసరాగా నిలివాలిని కోరారు. వీరి కోసం ఈ కేవైసీ అప్డేట్ చేసుకునేలా ప్రత్యేకమైన ఏర్పాటు చేయాలనీ విజ్ఞప్తి చేశారు.

# జీహెచ్ఎంసి అధ్యాయన యాత్రలో భాగంగా అస్సాం ముఖ్యమంత్రి హేమంత్ బిస్వా శర్మను కలిసిన చిల్కానగర్ కార్పొరేటర్ బన్నాల

**తెలంగాణ వీణ/ఉప్పల్:** జిహెచ్ఎంసి కార్పొరేటర్ల అధ్యయన యాత్రలో భాగంగా గురువారం అస్సాం ముఖ్యమంత్రి హేమంత్ బిస్వా శర్మతో గౌహతి లోని వారి క్యాంపు కార్యాలయం లో చిల్కానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి మరియు సహచర కార్పొరేటర్లు అర్చన ,సునీత ,మీనా మొదలగువారితో వారిని కలిసి మున్సిపాలిటీ లోనీ నగర పరిశీలన మరియు అభివృద్ధి పనులు వారి ప్రణాళిక విషయలు పై అధ్యయనం చేయడం, చర్చించడం జరిగింది.






# వ్యక్తిని హతమార్చిన వియ్యంకుడు





**తెలంగాణ వీణ/హైదారాబాద్:** నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలోని కంజర్ లో ఓ వ్యక్తిని వియ్యంకుడు హతమార్చాడు. ఈ ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కంజర్ గ్రామానికి చెందిన సత్యనారాయణ తన కూతురు భవితను అదే గ్రామానికి చెందిన నరహరి కుమారుడు గోవర్ధన్ కి ఇచ్చి వివాహం చేశాడు. కాగా.. ఇటీవల సత్యనారాయణ కూతురు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. దీంతో తన కూతురుని గోవర్ధన్ హత్య చేశాడని సత్యనారాయణ కోపం పెంచుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి గోవర్ధన్ కోసం సత్యనారాయణ వెళ్లగా గోవర్ధన్ లేకపోవడంతో తండ్రి నరహరిని కారం చల్లి కట్టెలతో కొట్టి హతమార్చాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.నిందితుడు పరారీలో ఉన్నాడు.

# పలు తీర్మానాలతో ముగుపాల మండల సభ



**తెలంగాణ వీణ/హైదారాబాద్:** నిజామాబాద్ జిల్లా ముగుపాల్ మండల సహకార సంఘం లో సోసిటీ ఛైర్మెన్ గ్యా నజీ గంగారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు చర్చల పై తీర్మానాలు జరిగాయి.రైతుల రుణమాఫీ కోసం జిల్లా కలెక్టర్ ను సంప్రదించాలని,అర్హులైన రైతులకు రుణమాఫీ చేయాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలు తొందరలో ప్రారంభించాలని ఛైర్మెన్ వైస్ ఛైర్మన్ లు తీర్మాణం చేశారు. సోసిటి వైస్ ఛైర్మన్ తిరుపతి.డైరెక్టర్ రాజ శేఖర్ రెడ్డి. ఉమాపతి రావు.సింగిడి చిన్నారెడ్డి నాను సింగ్ వెంగళ లక్ష్మి పతి.లింగవ్వ.మానిటరింగ్ అధికారి శ్రీనివాస్.కార్యదర్శి సాయి చందర్ వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# పేకాట ఆడుతున్న తెలంగాణ మహాలక్ష్మిలు అరెస్ట్

**తెలంగాణ వీణ/హైదారాబాద్:** పురుషులకు దీటుగా మహిళలు మేమెందులో తక్కువ అన్నట్టుగా పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళా మణులు.. ఇప్పుడు పేకాట ఆడుతూ పోలీసులకు అడ్డంగా దొరికిపోయారు. పేకాట ఆడుతున్న నలుగురు ఆడవాళ్లను బుధవారం సాయంత్రం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిజామాబాద్ నగరంలోని సరస్వతి నగర్ లో గల ఓ ప్రైవేట్ ఆస్పత్రి నాలుగవ అంతస్తులో బుద్ధినేని గోదాదేవి, అనే మహిళ ఆధ్వర్యంలో పేకాట ఆడుతున్నట్టుగా తెలిసింది. పేకాట ఆడుతున్న మహి ళలను పోలీసులు అరెస్టు చేయడం జిల్లాలో హాట్ టాపిక్ గా మారింది. పైగా, పోలీసులకు పట్టు బడ్డ మహిళలంతా ప్రముఖ వైద్యుల సతీమణులని సమాచారం. పేకాటలో పట్టుబడ్డ మహిళల దగ్గర నుండి 5 సెల్ ఫోన్లు, రూ.15,100ల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు నిజామాబాద్ ఒకటవ టౌన్ పోలీసులు వెల్లడించారు.



## ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు





**తెలంగాణ వీణ/మెదక్ జిల్లా :** చేగుంట మండల కేంద్రంలో, పోరాట స్ఫూర్తి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా మాజీ ఎంపీపీ, మాసుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మంచి కట్ల శ్రీనివాస్, వీరు మాట్లాడుతూ నాటి తెలంగాణ సాయుధ పోరాట వీర వనిత, చిట్యాల (చాకలి) ఐలమ్మ,బహుజన ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందని వారు, పేర్కొన్నారు ఈ సందర్భంగా రజాక సోదరులతో కలిసి చేగుంట లోని, చాకలి ఐలమ్మ విగ్రహానికి పూల మాల వేసి కేక్ కట్ చేశారు జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు.నాటి తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు, ప్రజాస్వామిక పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచాయని కొనియాడారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన తెగువ, పౌరుషం తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని చాటి చెప్పాయన్నారు మట్టిలోనే ఐలమ్మ జీవితమే నిదర్శనముగా నిలిచిందన్నారు. మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మంచి కట్ల శ్రీనివాస్, అధ్యక్షుడుశంకర్, ఉపాధ్యక్షుడు యాదగిరి, కోశాధి కారి రవి, డిష్ రాజు, వల్ప మహేష్, మేకల సతీష్, షాదుల్లా, అంజి, శరత్, సాయిబాబా, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## అస్సాం పర్యటనలో కార్పొరేటర్



**తెలంగాణవీణ/కూకట్‌పల్లి:**జిఎచ్ఎంసి అధికారిక అధ్యయనంలో భాగంగా, అస్సాం రాష్ట్ర పర్యటనలో ఉన్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, పర్యటనలో భాగంగా అస్సాం రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ హెమంత బిశ్వ శర్మ ని మర్యాదపూర్వకంగా కలిసిన ఆల్విన్ కాలని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్.జిఎచ్ఎంసి కార్పొరేటర్లు, అధికారులు, అస్సాం రాష్ట్ర ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు ఉన్నారు.

## యాదాద్రి పాత బస్టాండ్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి...

**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో పాత బస్టాండ్ లో గుర్తు తెలియని వ్యక్తి మృతి..వెంటనే ఆర్టీసీ డిపో కంట్రోలర్ పోలీసులకు సమాచారం అందించారు.సంఘటన స్థలికి చేరుకుని బస్టాండ్ లో బెంచ్ పై ఉన్న మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు చనిపోయిన వ్యక్తి సుమారు 40 సంవత్సరాల వయసు,చామన చాయ రంగు,5'5"ఎత్తు,ఆకుపచ్చ చొక్కా, బ్లూ కలర్ జీన్స్ ధరించి ఉన్నాడని,మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు తెలిపారు.



# మూసీకి పూర్వ వైభవం

సుందరీకరణతో పర్యాటక, పారిశ్రామిక ఉపాధి అవకాశాలు, మూసీ సుందరీకరణ, ప్రక్షాళన నేపథ్యంలో అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలని రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. నిర్మాణాల తొలగింపు బాధ్యతను హైడ్రాకు అప్పగించిది. మూసీ పరివాహక ప్రాంతాంలో ఉంటున్న నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించనుంది. ఇప్పటికే మూసీ ఆక్రమణలపై అధికారులు సర్వే నిర్వహించారు. మొత్తం 55 కిలోమీటర్ల పరిధిలో 16 వేలకు పైగా ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించారు. మూసీ సుందరీకరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు.మూసీ ప్రాంతాన్ని పర్యాటక, పారిశ్రామిక, ఉపాధి అవకాశాలు పెంచే విధంగా అభివృద్ధి చేయనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే పేర్కొంది. మూసీ నది ప్రక్షాళన, పునః నిర్మాణాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నారు.ఆపరేషన్ మూసీ తో అక్రమాలకు చెక్ఆపరేషన్ మూసీ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించింది. మూసీ నదీగర్భంలో 2,166 నిర్మాణాలు ఉన్నట్లు గుర్తించారు. అందులో హైదరాబాద్ జిల్లా పరిధిలో 1595, రంగారెడ్డి జిల్లా పరిధిలో 332, మేడ్చల్ జిల్లాలో మూసీ పరివాహన పరిధిలో 239 వరకు అక్రమ నిర్మాణాలను తక్షణం తొలగించవలసి ఉందని ప్రభుత్వం నిర్ణయించింది. పేదలు నిర్మించుకున్న ఇళ్లను నదీ గర్భం నుండి తొలగించడంలో వారు నిరాశ్రయులు కాకుండా డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించడానికి ఇప్పటికే ప్రభుత్వం ఉత్తర్వుల జారీ చేసింది. ఎఫ్. టి.ఎల్, బఫర్ జోన్లను గుర్తించడంతో పాటుగా బఫర్ జోన్లలోని నిర్మాణాలకు మార్క్ చేయబోతున్నారు. బఫర్ జోన్లలో అనేక కాలనీలు ఏర్పడ్డాయి.చట్టబద్దంగా వెలసిన అలాంటి కాలనీలలో దాదాపు 30 సంవత్సరాలకు పైగా మధ్యతరగతి వర్గాలు నివాసం ఉంటున్నారు.వరద ప్రవాహానికి ఈ ప్రాంతాలు ఏ మాత్రం ఆటంకం కావడం లేదు. అందుకే బఫర్ జోన్ ప్రాంతాల్లో హద్దులు ఏర్పాటు చేసి, భవిష్యత్ లో నిర్మాణాలకు తావు లేని విధంగా బోర్డులు ఏర్పాటు చేయబోతున్నారు.వర్షంనీటి ముంపు నుండి విముక్తి గత పాలకుల నిర్లక్ష్యం, పారిశ్రామిక వర్గాల స్వార్ధం, అస్తవ్యస్తమైన మురుగునీటి వ్యవస్థ, పేద, మధ్యతరగతి వర్గాల నివాస అవసరాలు, రియాల్టర్ల అక్రమాలు, అధికారుల అవినీతి కారణంగా మూసీ నది మురుగు నీటి ప్రవాహంగా మారింది. పట్టణ వాసం పెరగడంతో నదీ గర్భంలో వేలాది పేద కుటుంబాలు నివాసాలను ఏర్పాటు చేసుకున్నారు. ఎఫ్ టి ఎల్, బఫర్ జోన్లలో మధ్యతరగతి వర్గాలు అన్ని రకాల ప్రభుత్వ అనుమతులతో ఇండ్లు నిర్మించుకున్నారు. ఇలాంటి కాలనీలలో మున్సిపల్ అధికారులు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించి ఇంటి పన్నును కూడా వసూలు చేస్తున్నారు. ఈ పరిస్థతులను పరిగణలోకి తీసుకొని జల ప్రవాహాలకు ఆటంకం కాని బఫర్ జోన్లలో కూల్చివేతలను కుదించే ఆలోచనలో ప్రభుత్వం ఉందని అధికార వర్గాలు ఇప్పటికే సంకేతాలు ఇచ్చాయి. గత పాలకులు మూసీ రివర్ బోర్డును ఏర్పాటు చేసినప్పటికీ తగిన చర్యలు తీసుకోని కారణంగానే హైదరాబాద్ నగరం వర్షాకాలంలో ముంపుకు గురువుతుంది. జల ప్రవాహాలకు అడుగడుగున ఆటంకాలు పెరగడంతో రోడ్లపై వరద నీరు ప్రవహించే పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితిని అధిగమించి మూసీ పరీవాహక ప్రాంతాలను పర్యాటక, ఉపాధి కల్పన కేంద్రాలుగా మార్చడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతున్నప్పటికీ అక్రమంగా వెలసిన నిర్మాణాలను కూల్చడంతో కొందరిలో ప్రభుత్వంపై వ్యతిరేకత అనివార్యమయింది. మూసీ సుందరీకరణ ప్రణాళిక నిర్ధిష్టంగా అమలయినట్లయితే ఈ మాత్రం వ్యతిరేకత కూడా ప్రభుత్వం పై ఉండబోదని అంటున్నారు.విశ్వనగరంగా హైదరాబాద్మూసీ నదీ పరివాహక ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టులో రిక్రియేషన్ జోన్‌లు, పాదచారుల జోన్‌లు, పీపుల్స్ ప్లాజాలు, చిల్డ్రన్స్ థీమ్ పార్కులు, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్‌ల అభివృద్ధి, లండన్ నగరంలో ఉన్న థేమ్స్ నదీ పరివాహక అభివృద్ధి తరహాలో మూవీ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు.కార్యాచరణ అమలుకు బడ్జెట్ లో మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు కోసం 1,500 కోట్లు ప్రతిపాదించారు. విశ్వనగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, శరవేగంగా అభివృద్ధి చెందుతున్న చారిత్రాత్మక నగరం హైదరాబాద్‌ను మరింత ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దవలసి ఉందని పేర్కొనడం గమనార్హం. ప్రకృతిని కాపాడుకునే యజ్ఞం అందుకే తెలంగాణ ప్రభుత్వం ప్రకృతిని కాపాడుకునే యజ్ఞం ప్రారంభించింది. ఆ కార్యక్రమం పేరే హైడ్రా. ఇప్పుడు హైడ్రా అంటే భూ మాఫీయాగాళ్లు హడలెత్తిపోతున్నారు. ప్రకృతికి ఆటంకం కలిగించిన శక్తులతో హైడ్రా పోరాటం కొనసాగడంతో ప్రకృతి ప్రేమికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ లో కబ్జాలకు తావు లేదంటూ, ఆక్రమణల అడ్డు తొలగిస్తామంటూ అధికార యంత్రాంగం ముందుకు సాగడంతో ఎఫ్ టి ఎల్, బఫర్ జోన్లలో అక్రమంగా వెలసిన కట్టడాలు పేక మేడలుగా కుప్పకూలిపోతున్నాయి. వరద ప్రవాహాలకు అడ్డు తొలగడంతో తటాకాలలో జళ కల నెలకొంటుంది.లేక్ సిటీగా నగరానికి పూర్వ వైభవం రాష్ట్రానికి ఆర్ధిక పరిపుష్టి కల్పించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకట్టుకుంటుంది. సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించి భవిష్యత్ తరాలకు అందించడానికి చర్యలను వేగవంతం చేసింది. ఒకప్పటి లేక్ సిటీ కాలక్రమేనా ఫ్లడ్ సిటీగా మారడంతో వరద ముంపు నుండి నగరాన్ని కాపాడటంతో పాటుగా పర్యావరణాన్ని పరిరక్షించానికి కంకణబద్ధమై వేగవంతమైన చర్యలకు శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టతో తీసుకున్న ఈ మూడు నిర్ణయాలను అమలు పర్చడంలో అధికార యంత్రాంగం ఎంతో పట్టుదలతో వ్యవహరిస్తున్నారు. కాలక్రమేనా సానుకుల ఫలితాలను రాబడుతోంది.గ్రేటర్ హైదరాబాద్ కు లేక్ సిటీగా పూర్వ వైభవం తీసుకురావడానికి చర్యలు చేపట్టింది. జలాశయాలను కాపాడి, ప్రకృతిని పరిరక్షించడం ద్వారా ముంపు సమస్యలను అధిగమించడానికి ప్రయత్నాలు ప్రారంభించింది.హైడ్రా చర్యలు హర్షనీయంప్రభుత్వ భూములు, చెరువులు, కుంటల అక్రమణలు, నదీ గర్భంలో నిర్మాణాలు, కనుమరుగవుతున్న ఎఫ్ టి ఎల్, బఫర్ జోన్లను గుర్తించి, భవిష్యత్ తరాలకు మెరుగైన వాతావరణంతో అభివృద్ధి దాయకమైన హైదరాబాద్ ను అందించడం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా చర్యలు హర్షనీయంగా ఉన్నాయి. ఇలాంటి కార్యక్రమాలు రాష్ట్రమంతటా అమలు కావాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు. పురపాలక సంఘాల పరిధిలో కూడా చెరువులు, కుంటలు, ఇతర జలాశయాలు మాయమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రియాల్టర్లు, భవన నిర్మాణాలకు అనుమతులిచ్చే అధికారులు కుమ్మక్కు కావడంతో ఎఫ్ టి ఎల్, బఫర్ జోన్లలో కూడా వెంచర్లు వెలుస్తున్నాయని ప్రభుత్వం దృష్టికి తెస్తున్నారు. అక్రమనలకు అడ్డుకట్ట వేయడం ద్వారా చెరువులు, కుంటల ప్రభుత్వ భూములను పరిరక్షించడంతో పాటు జలవనరులను పెంచుకొని, పర్యావరణాన్ని పరిరక్షించవలసి ఉందని అంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకుంటున్న కఠిన చర్యలకు సర్వత్రా మద్దతు పలుకుతున్నారు. తెలంగాణ జల వనరులకు పూర్వ వైభవం తీసుకురావాలని కోరుకుంటున్నారు.



కొలను వెంకటేశ్వర రెడ్డి,
ఎస్ పి, జైల్స్ ( రిటైర్డ్)

## తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాంకు సన్మానం



**తెలంగాణ వీణ/ఓయూ:** తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాలలో ఎమ్మెల్సీ కోదండరాం కు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పలువురు టీచర్లు కోదండరాం ను శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ యూనివర్సిటీలలో పనిచేసే పార్ట్ టైం టీచర్ల సమస్యల పరిష్కారం కొరకు కృషి చేస్తానని అన్నారు. యూనివర్సిటీలలో కాంట్రాక్టు ఉద్యోగులు ఉండనే ఉండరు అని గత బీఆర్ఎస్ ప్రభుత్వం హామీ ఇచ్చి నెరవేర్చలేదని అన్నారు. కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేసి ఉన్న ఖాళీలను భర్తీ చేస్తారని అందరం ఆశపడ్డామని అన్నారు. కానీ కాంట్రాక్టు లెక్చరర్లకు బదులు పార్ట్ టైం లెక్చరర్ లను భర్తీ చేయడం ప్రారంభించిందని అన్నారు. యూనివర్సిటీలు నడుస్తున్నాయంటే అది కేవలం కాంట్రాక్టు, పార్ట్ టైం టీచర్ల వల్లనే అని అన్నారు. పార్ట్ టైం టీచర్లకు వచ్చే జీతాలు కూడా చాలా తక్కువన్నారు. చాలీచాలని జీతాలతో పార్ట్ టైం టీచర్లు దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్ట్ టైం టీచర్ల సమస్యలను తప్పకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొ. గడ్డం మల్లేశం తో పాటు పలురు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

## యాదాద్రి లక్ష్మీ నృసింహ స్వామి నిత్య కళ్యాణ మహోత్సవం..





**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:**శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి నిత్య కళ్యాణం వైభవంగా జరిగింది..స్వామివారి ఆలయ పురవీధుల్లో సేవను ఊరేగించారు.అనంతరం ఆలయ కళ్యాణ మండప ఆవరణలో లక్ష్మీ నరింహస్వామి నిత్య కళ్యాణం మహోత్సవం అర్చకులు వేదపండితులు వేదమంత్రాలతో మాంగళ్య ధారణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు.భక్తులు భక్తి శ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు.

## సీఎం సహాయ నిధి పేద ప్రజలకు వరం: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**తెలంగాణ వీణ/మల్కాజ్గిరి:** సీఎం సహాయనిది పేద ప్రజలకు ఓ వరం లాంటిదని మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం తన కార్యాలయంలో సీఎం సహాయ నిధి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.. నేరేడ్మెట్ డివిజన్ చెందినఎన్ కనకయ్య 2 లక్షలు, వెంకటాపురం డివిజన్ చెందిన డి. మహేందర్ కు లక్షా 50 వేలు, గౌతమ్ నగర్ డివిజన్ ఇచ్చిన ఎస్ సురేంద్రకు రెండు లక్షలు ఎల్ ఓ సి ని లబ్ధిదారులకు ఎమ్మెల్యే మరి రాజశేఖర్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నేతలు మేకల రాము యాదవ్, ఉపేందర్ రెడ్డి, అనిల్ కిషోర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు



6 9 TV తెలుగు
తెలంగాణ వీణ
For Advertisements
8328209811
Flat No 204,
Mythri Appartments,
Opp BSNL Office, ECIL

# టీ20 క్రికెట్‌కి రిటైర్మెంట్ ప్రకటించిన షకీబ్ అల్ హసన్



బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు స్టార్ ఆల్ రౌండర్ షకీబ్ అల్ హసన్ గురువారం టీ20 క్రికెట్ కి రిటైర్మెంట్ ప్రకటించాడు. కాన్పూర్‌లో భారత్‌తో జరగనున్న రెండో టెస్టు మ్యాచ్‌కు ముందు వెటరన్ ఈ నిర్ణయం తీసుకున్నాడు. సెప్టెంబర్ 27 నుంచి కాన్పూర్‌లో భారత్‌తో జరగనున్న రెండో టెస్టు మ్యాచ్‌లో షకీబ్ ఆడనున్నాడు. దీని తర్వాత అతడు బంగ్లాదేశ్ తరపున మరో సిరీస్‌లో టెస్ట్ క్రికెట్ ఆడబోతున్నాడు. ఆపై అతడు రెడ్ బాల్ క్రికెట్ నుండి రిటైర్ అవుతాడు. దక్షిణాఫ్రికాతో మిర్పూర్‌లో జరిగే టెస్టు తనకు చివరి టెస్టు అని చెప్పాడు. భారత్‌తో రెండో టెస్టుకు ముందు కాన్పూర్‌లో షకీబ్ మీడియాతో మాట్లాడాడు. “రిటైర్ అవడం నా కోరిక. నేను నా నిర్ణయాన్ని బీసీబీ మరియు సెలెక్టర్లతో పంచుకున్నాను. “వారు నాతో ఏకీభవించారు. నేను బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లి ఆ రెండు టెస్ట్ మ్యాచ్‌లు ఆడుతాను. మీర్పూర్‌లో నా టెస్ట్ కెరీర్‌ను ముగించడానికి వీలుగా వారు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నాడు. “నా చివరి మ్యాచ్‌గా ఆడాలనేది నా కోరిక. అది జరగకపోతే.. ఇదే (కాన్పూర్ టెస్టు) నా చివరి మ్యాచ్ అవుతుందని పేర్కొన్నాడు. టీ20లలో ప్రపంచ కప్ లో నేను నా చివరి మ్యాచ్ ఆడినట్లు భావించాను. నేను సెలెక్టర్లు, బోర్డుతో దీని గురించి చర్చించాను. నేను 2026 టీ20ప్రపంచ కప్‌ను చూస్తున్నాను. ఇది సరైన సమయం.. నేను ముందుకు వెళ్లడానికి.. %దీజదీ% కొంతమంది కొత్త ఆటగాళ్లను పరిశీలిస్తుంది. వారు కొంతమంది గొప్ప ఆటగాళ్లను కనుగొంటారు. మేము 2026 ప్రపంచ కప్‌లో బాగా రాణిస్తామని విశ్వాసం వ్యక్తం చేశాడు. నేను బంగ్లాదేశ్ పౌరుడిని, కాబట్టి నాకు బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లడానికి ఎటువంటి సమస్య లేదు. కానీ బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్ళిన తర్వాత నా సమస్యలు మొదలవుతాయి. నేను బంగ్లాదేశ్‌లో నివసిస్తున్నప్పుడు.. భద్రత సమస్య అనేది నా సన్నిహితులు, కుటుంబ సభ్యుల నుండి నేను వింటున్నాను, వారు ఆందోళనతో ఉన్నారు. ఒక పరిష్కారం ఉంటుందని నేను ఆశిస్తున్నానని బంగ్లాలో నెలకొన్న భద్రతా సమస్యల గురించి మాట్లాడాడు.

# రెండో టెస్టులో భారత తుది జట్టులో మార్పు జరిగే అవకాశం



బంగ్లాదేశ్‌తో చెన్నైలో జరిగిన తొలి టెస్టులో టీమిండియా ఘన విజయం సాధించింది. బంగ్లాను ఏకంగా 280 పరుగుల తేడాతో చిత్తు చేసింది. అదే ఊపులో కాన్పూర్ వేదికగా శుక్రవారం ఆరంభమయ్యే రెండో టెస్టులోనూ గెలిచి.. సిరీస్ క్లీన్ స్వీప్ చేయాలని రోహిత్ సేన చూస్తోంది. అంతేకాదు సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుని డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకోవాలని లక్ష్యంతో రెడీ అవుతోంది. కాన్పూర్ పిచ్ స్పిన్‌కు సహకరిస్తుందన్న వార్తల నేపథ్యంలో భారత తుది జట్టులో మార్పు జరిగే అవకాశం ఉంది. సాధారణంగా కాన్పూర్ పిచ్ స్పిన్నర్లకు సహకరిస్తుంది. అందుకే భారత్ ఎక్స్‌ట్రా స్పిన్నర్‌తో బరిలోకి దిగే అవకాశం ఉంది. స్పెషలిస్ట్ స్పిన్నర్లు ఆర్ అశ్విన్, రవీంద్ర జడేజా ఆడటం ఖాయం. మూడో స్పిన్నర్ ఎవరా? అనేది ఇప్పుడు ఆసక్తిగా మారింది. మణికట్టు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను ఆడిస్తారా? లేదా బ్యాటింగ్ బలోపేతం కోసం అక్షర్ పటేల్‌ను తీసుకుంటారా? అనేది చూడాలి. కుల్దీప్ తుది జట్టులోకి వచ్చే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. ఎక్స్‌ట్రా స్పిన్నర్ రాకతో ఒక పేసర్ బెంచ్‌కు పరిమితం కానున్నాడు. న్యూజీలాండ్, ఆస్ట్రేలియా సిరీస్ నేపథ్యంలో స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు విశ్రాంతిని ఇస్తారని తెలుస్తోంది. దాంతో మహమ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్ తుది జట్టులో కొనసాగనున్నారు. బ్యాటింగ్ విభాగంలో మార్పులు జరిగే అవకాశం లేదు. ఓపెనర్లుగా రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్ బరిలోకి దిగనున్నారు. గిల్, కోహ్లీ, పంత్, రాహుల్‌లు వరుసగా బ్యాటింగ్ చేయనున్నారు. మొదటి టెస్టులో గిల్, పంత్, అశ్విన్ సెంచరీలు చేసిన విషయం తెలిసిందే.

# ప్రాక్టీస్ సెషన్‌లో పంత్ బౌలింగ్



బంగ్లాదేశ్‌తో జరగనున్న రెండో టెస్టుకు టీమిండియా కసరత్తు చేస్తోంది. సెప్టెంబర్ 27 నుండి కాన్పూర్‌లోని గ్రీన్ పార్క్‌లో జరుగనున్న టెస్ట్‌లో ఇరు జట్లు తలపడనున్నాయి. ఈ సిరీస్‌లోని మొదటి టెస్ట్‌లో చెన్నైలో భారత జట్టు అద్భుతమైన ప్రదర్శనతో విజయం సాధించింది. రెండో టెస్టుకు ముందు, మ్యాచ్‌తో పాటు సిరీస్‌ను కైవసం చేసుకునేందుకు టీమిండియా తన నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటుంది. నెట్స్‌లో బ్యాటింగ్‌లో, స్టార్ ఇండియా బ్యాటర్లు రిషబ్ పంత్ మరియు శుభ్‌మన్ గిల్ మధ్య జరిగిన క్షణం వైరల్ అయ్యింది. టీమిండియా స్టార్ బ్యాట్స్‌మెన్ శుభ్‌మన్ గిల్ బ్యాటింగ్ ప్రాక్టీస్ వీడియోను బీసీసీఐ షేర్ చేసింది. అందులో.. గిల్‌కు రిషబ్ పంత్ బౌలింగ్ చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ రోజు ప్రాక్టీస్ సెషన్‌లో భాగంగా పంత్ బౌలింగ్ చేయడం కనిపించింది. కాగా.. ఈ ఫన్నీ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో పంత్ గిల్‌కు ముచ్చెమటలు పట్టించాడు. పంత్ బౌలింగ్ చేస్తుంటే.. గిల్ కష్టంగా ఆడుతున్నట్లు కనిపించింది. ఈ వీడియోలో మీరు ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో కూడా బౌలింగ్ చేశారా అని పంత్‌ను కేఎల్ రాహుల్ అడిగాడు. కాన్పూర్ పిచ్ స్పిన్నర్లకు సహకరించనున్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో ముగ్గురు స్పిన్నర్లతో టీమిండియా ఫీల్డింగ్ చేస్తే మహ్మద్ సిరాజ్ లేదా ఆకాశ్ దీప్‌లలో బెంచ్ కు పరిమితం కానున్నారు. ఇదిలా ఉంటే.. టీమిండియా హెడ్ కోచ్ గంభీర్ ఉంటే.. బ్యాట్స్ మెన్ బౌలింగ్ చేయడం మామూలే.. కానీ వికెట్ కీపర్ బౌలింగ్ చేయడం అనేది వింతగా ఉంది. ఇదిలా ఉంటే.. ఢిల్లీ టీ20 ప్రీమియర్ లీగ్‌లో పంత్ బౌలింగ్ చేశాడు. లీగ్ తొలి మ్యాచ్లో చివరి ఓవర్ వేశాడు. కుడి చేతి వాటంతో స్పిన్ బౌలింగ్ వేశాడు. కాగా.. రిషభ్ పంత్ బౌలింగ్ చేయడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ప్రభావం పంత్‌పై చూపిందని.. అందుకే ఇలా బౌలర్ అవతారం ఎత్తాడని ఫ్యాన్స్ అభిప్రాయపడ్డారు. శ్రీలంక పర్యటనలో సూర్యకుమార్ యాదవ్, రింకూ సింగ్, శుభ్‌మన్ గిల్, కెప్టెన్ రోహిత్ శర్మ లాంటి టీమిండియా స్పెషలిస్టు బ్యాటర్లు సైతం బౌలింగ్ చేసిన విషయం తెలిసిందే.

# వినేష్ ఫోగట్‌కు నాడా నోటీసు..

## - 14 రోజుల్లో వివరణ ఇవ్వాలని వెల్లడి

భారత స్టార్ రెజ్లర్, కాంగ్రెస్ నేత వినేష్ ఫోగట్‌కు జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ బుధవారం నోటీసు జారీ చేసింది. పారిస్ ఒలింపిక్స్ ఫైనల్లో బరువు కారణంగా అనర్హత వేటుపడింది. 14 రోజుల్లో వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది. 100 గ్రాములు ఎక్కువగా ఉండడంతో పారిస్ ఒలింపిక్స్ నుంచి నిష్క్రమించింది. అంతేకాకుండా క్రీడల నుంచి రిటైర్మెంట్ కూడా ప్రకటించేసింది. రిజిస్టర్డ్ టెస్టింగ్ పూల్ లో నమోదు చేసుకున్న అథ్లెట్లందరూ డోప్ పరీక్షల కోసం వారి వివరాలు అందించాల్సి ఉంటుంది. వివరాలు పూరించి.. ఆ సమయంలో ఆ ప్రదేశంలో అందుబాటులో లేకపోతే అది వైఫల్యంగా పరిగణించబడుతుంది. సోనెపట్‌లోని ఖరో?డా గ్రామంలోని తన ఇంట్లో సెప్టెంబర్ 9న డోప్ టెస్ట్‌కు ఆమె అందుబాటులో లేకపోవడంతో ఆమె ఆచూకీ వైఫల్యానికి పాల్పడినట్లు నాడా తన నోటీసులో పేర్కొంది. దీనిపై నాడా క్లారిటీ కోరింది. మొత్తానికి వినేష్ ఫోగట్ నుంచి సమాచారాన్ని కోరింది. కానీ ఆమె మాత్రం ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నారు. దీనిపై ఆమె క్లారిటీ ఇస్తుందా? లేదంటే దాట వేస్తుందా? అన్నది తేలాల్సి ఉంది. ఇదిలా ఉంటే పారిస్ ఒలింపిక్స్ విఫలమై భారత్‌కు చేరుకున్నాక.. వినేష్ ఫోగట్ కాంగ్రెస్‌లో చేరారు. అంతేకాకుండా హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో జులానా నియోజకవర్గం నుంచి సీటు కూడా కేటాయించింది. ప్రస్తుతం ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నారు. ఇక్కడ అక్టోబర్ 5న పోలింగ్ జరగనుంది. ఎన్నికల ఫలితాలు మాత్రం అక్టోబర్ 8న విడుదల కానున్నాయి.



# ఫ్రాంచైజీల డిమాండ్‌ను అంగీకరించని బీసీసీఐ

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో మెగా వేలం వచ్చిన ప్రతిసారీ అన్ని జట్లలో చాలా మార్పులు చోటుచేసుకుంటాయి. మెగా వేలం సమయంలో నలుగురు ఆటగాళ్లను మాత్రమే అట్టిపెట్టుకునే అవకాశం ఐపీఎల్ జట్లకు ఉంటుంది. దాంతో ఫ్రాంఛైజీలు కీలక ఆటగాళ్లను కోల్పోవడంతో జట్టు స్వరూపం పూర్తిగా మారిపోతుంటుంది. అయితే ఈసారి ఒకరిని అదనంగా అట్టిపెట్టుకునే అవకాశాన్ని ఫ్రాంఛైజీలకు బీసీసీఐ కల్పించబోతోందని తెలుస్తోంది. అట్టిపెట్టుకునే ఆటగాళ్ల సంఖ్యను అయిదుకు పెంచాలని ఫ్రాంఛైజీలు ఎప్పట్నుంచో డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఫ్రాంఛైజీలు, బీసీసీఐ మధ్య జరిగిన సమావేశం అసంపూర్తిగా ముగిసింది. కొన్ని కారణాల వల్ల ఫ్రాంచైజీల డిమాండ్‌ను బీసీసీఐ అంగీకరించలేదు. అయితే చివరకు ఫ్రాంచైజీల డిమాండ్‌కు బీసీసీఐ ఓకే అన్నట్లు సమాచారం. ప్రతీ ఫ్రాంచైజీకి ఐదుగురు ఆటగాళ్ల రిటెన్షన్ ఇవ్వాలని బీసీసీఐ నిర్ణయించినట్లు తెలుస్తోంది. రైట్ టు మ్యాచ్ (ఆర్‌టీఎమ్) కార్డ్ ఈసారి లేదని సమాచారం. ఐపీఎల్ 2025లో ఐదుగురు ఆటగాళ్లను ప్రతీ టీమ్ అట్టిపెట్టుకోవచ్చు. ఇది ముంబై ఇండియన్స్ లాంటి జట్లకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. కెప్టెన్ హార్దిక్ పాండ్యా, మాజీ సారథి రోహిత్ శర్మ, స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా, మిస్టర్ 360 సూర్యకుమార్ యాదవ్‌లను ముంబై ఇండియన్స్ అట్టిపెట్టుకునే అవకాశముంది. ఇక తిలక్ వర్మ, ఇషాన్ కిషన్‌లలో ఒకరిని ఆర్‌టీఎమ్ ద్వారా తీసుకుంటుంది. రోహిత్‌ను కెప్టెన్‌గా తప్పించిన నేపథ్యంలో హిట్‌మ్యాన్ వేలంలోకి వెళ్తాడనే ప్రచారం జరిగింది. ముంబై కూడా రోహిత్‌ను వదులుకుంటుందని వార్తలు చక్కర్లు కొట్టాయి. అయితే ఇప్పుడు ముంబై యాజమాన్యం, రోహిత్ మధ్య మంచి సంబంధాలు ఉన్న కారణంగా.. హిట్‌మ్యాన్ జట్టుతో కొనసాగేందుకు సుముఖంగా ఉన్నాడని తెలుస్తోంది. రోహిత్‌తో ముంబై యాజమాన్యం సుదీర్ఘ చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. హిట్‌మ్యాన్ ముంబైకి ఐదు టైటిల్స్ అందించిన విషయం తెలిసిందే.




# అనామక బౌలర్‌ను ఎదుర్కోలేక.. రెండుసార్లు ఔటైన కోహ్లీ



అంతర్జాతీయ క్రికెట్‌లో సుదీర్ఘ అనుభవం, టన్నులకొద్దీ పరుగులు, లెక్కలేనన్ని రికార్డులు.. ఇలా ఎన్నో ఘనతలు సాధించిన విరాట్ కోహ్లీ ఓ అనామక బౌలర్‌ను ఎదుర్కోలేక పోయాడు. బంగ్లాదేశ్‌తో కాన్పూర్‌లో జరుగబోయే రెండో టెస్టుకోసం నెట్స్‌లో సాధన చేస్తున్న కోహ్లీకి ఓ యువ బౌలర్ షాకిచ్చాడు. అంతుపట్టని బౌలింగ్‌తో, వైవిధ్యంతో విరాట్‌ను బోల్తా కొట్టించాడు. అలాగని ఒకసారి కాదు రెండుసార్లు వికెట్ పడగొట్టాడు. దాంతో, అతడి పేస్‌కు కోహ్లీ ఫిదా అయ్యాడు.తనను రెండు సార్లు ఔట్ చేసిన బౌలర్‌ను కోహ్లీ నీ వయసెంత? అని అడిగాడు. మరింత కష్టపడు జట్టులోకి వస్తావ్ అని ఆ నెట్ బౌలర్‌పై ప్రశంసలు కురిపించాడు. కోహ్లీ తనను మెచ్చుకోవడంతో ఆ యువ పేసర్ ఉబ్బితబ్బిబ్బవుతున్నాడు. ఇంతకు అతడి పేరు ఏంటంటే..? జంషెడ్ అలామ్ లక్నోకు చెందిన అతడు కోహ్లీకి బౌలింగ్ గురించి ఏం చెప్పాడంటే.. ‘నేను నెట్స్‌లో కోహ్లీకి 24 బంతులు సంధించాను. 135 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేశాను. రెండుసార్లు కోహ్లీ వికెట్ సాధించాను. కోహ్లీ ప్రశంసతో నాకు చంద్రుడిపై తేలిపోతున్నట్టుగా ఉంది’ అని 22 ఏండ్ల జంషెడ్ తెలిపాడు. ఇక చెపాక్‌లో 6, 17 పరుగులతో నిరాశపరిచిన కోహ్లీ భారీ స్కోర్ బాకీ ఉన్నాడు. తొలి టెస్టులో బంగ్లాదేశ్‌ను చిత్తుగా ఓడించిన టీమిండియా సిరీస్ పట్టేయాలనే పట్టుదలతో ఉంది. ఈ మ్యాచ్‌లోనైనా విరాట్ 30 టెస్టు సెంచరీ కొట్టాలని యావత్ భారతం కోరుకుంటోంది.


GS9TV తెలుగు

తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేల్చుదాం..

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

అతి కొద్ది కాలంలోనే ప్రజలకు ప్రజాప్రతినిధులకూ వారధి గా ప్రదర్శింపబడుతున్న

GS9TV కేబుల్ ఛానల్, తెలంగాణ వీణ తెలుగు దినపత్రికకు

అన్నీ జిల్లాల నుండి విలేకరులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి.

సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు

8328209811

9703024024

# 'దేవర'ను తాకిన వైజాగ్ స్టీల్ ప్లాంట్ నిరసన

**'దేవర' పోస్టర్లపై జన జాగరణ సమితి పోస్టర్లు**

**'దేవర' సినిమా పోస్టర్లపై 'సేవ్ వైజాగ్ స్టీల్ ప్లాంట్' అనే నినాదాలు**




జూనియర్ ఎన్టీఆర్ తాజా చిత్రం 'దేవర' రేపు (సెప్టెంబరు 27) ప్రపంచ వ్యాప్తంగా విడుదలవుతోంది. మరోవైపు ఈ చిత్రాన్ని విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యమం సెగ తాకింది. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి మద్దతునివ్వాలని జన జాగరణ సమితి వినూత్న రీతిలో నిరసన చేపట్టింది. 'దేవర' సినిమా పోస్టర్లపై 'సేవ్ వైజాగ్ స్టీల్ ప్లాంట్', 'విశాఖ ఉక్కు... ఆంధ్రుల హక్కు' అనే నినాదాలను జన జాగరణ సమితి నేతలు అతికించారు.స్టీల్ ప్లాంట్ నినాదాలను సినిమా పోస్టర్ పై అతికిస్తే... తమ పోరాటం మరింతగా ప్రజల్లోకి వెళుతుందనేది జన జాగరణ సమితి నేతల ఆలోచన. మరి పోస్టర్ల వ్యవహారంపై తారక్ కానీ, చిత్ర యూనిట్ సభ్యులు కానీ స్పందిస్తారేమో వేచి చూడాలి. 'దేవర' సినిమా విషయానికి వస్తే... ఈ చిత్రంలో తారక్ సరసన బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ నటించింది. కొరటాల శివ తెరక్కించిన ఈ చిత్రానికి నందమూరి కల్యాణ్ రామ్ కూడా ఒక నిర్మాతగా వ్యవహరించారు. ఈ చిత్రం రికార్డు స్థాయిలో అడ్వాన్స్ బుకింగ్స్ ను రాబట్టి అంచనాలను అమాంతం పెంచేసింది.

# సెన్సేషనల్ మూవీ ఓటీటీలో వచ్చేసింది, కానీ...!

శ్ధా కపూర్, రాజ్ కుమార్ రావు ముఖ్య పాత్రల్లో అమర్ కౌశిక్ దర్శకత్వంలో రూపొంది ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'స్త్రీ 2' సినిమా సంచలన విజయాన్ని సొంతం చేసుకుంది. వరల్డ్ బాక్సాఫీస్ వద్ద దాదాపుగా రూ.800 కోట్ల వసూళ్లు నమోదు చేసిన ఈ సినిమా ఎన్నో రికార్డులను బ్రేక్ చేసింది. ఇప్పటి వరకు ఏ హిందీ సినిమా సాధించని వసూళ్లను ఈ సినిమా దక్కించుకుని సంచలనం సృష్టించింది. ఓ లేడీ ఓరియంటెడ్ సినిమా, హర్రర్ కామెడీ సినిమా ఈ స్థాయి వసూళ్లు సాధించడం ఏంటంటూ మొత్తం సినిమా లోకం ఆశ్చర్యం వ్యక్తం చేసి, ఇంతకు స్త్రీ 2 లో ఏం ఉందంటూ చర్చించుకోవడం మొదలు పెట్టారు. ఆగస్టు 15న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా అప్పటి నుంచి ఇప్పటి వరకు వార్తల్లో నిలుస్తూనే ఉంది. మొదటి వంద కోట్ల వసూళ్లు నమోదు చేసిన సమయంలోనే ప్రతి ఒక్కరూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అలాంటిది ఏకంగా రూ.800 కోట్ల వసూళ్లకు చేరువ అవ్వడం అంతా షాకింగ్ ను కలిగించింది. నాలుగు వారాల తర్వాత ఈ సినిమా ఓటీటీ స్ట్రీమింగ్ అవుతుందని ఎదురు చూసిన ప్రేక్షకులకు ఆరు వారాలు అయినా ఇంకా ఓటీటీ లోకి రాలేదు. ఇటీవలే అమెజాన్ ప్రైమ్ ద్వారా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చారు. అయితే ఈ సినిమాను చూడ్డానికి రూ.349 అద్దె చెల్లించాల్సి ఉంటుంది. రెండు లేదా మూడు వారాల పాటు ఇలా అద్దె చెల్లించి స్త్రీ 2 చూడాల్సి ఉంటుందని తెలుస్తోంది. ప్రస్తుతానికి హిందీ వర్షన్ ను మాత్రమే అద్దె చెల్లించి చూసే విధంగా అమెజాన్ ప్రైమ్ అందుబాటులో ఉంచింది.

# ట్రెండీ డ్రెస్‌లో సామ్.. వ్వాటే లుక్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంతకు ఎలాంటి క్రేజ్, ఫ్యాన్ బేస్, ఫాలోయింగ్ ఉందో అందరికీ తెలిసిందే. 14 ఏళ్ల సినీ కెరీర్ లో ఎన్నో విజయాలు సాధించింది. మరెన్నో ప్రశంసలు అందుకుంది. అన్నిటి కన్నా.. వేరే లెవెల్ లో పాపులారిటీ దక్కించుకుంది. ప్రభాస్ మినహా టాలీవుడ్ స్టార్ హీరోలందరితో ఆడిపాడింది. ఆమె యాక్ట్ చేసిన చిత్రాలు దాదాపు అన్నీ బాక్సాఫీస్ వద్ద మంచి హిట్స్ గా నిలిచాయి. చివరగా ఖుషి సినిమాతో సందడి చేసింది సామ్. యశోద మూవీ టైమ్ లో మయోసైటిస్ బారిన పడ్డ సమంత.. ఆ తర్వాత చికిత్స తీసుకుంది. తన చేతిలో ఉన్న ప్రాజెక్ట్స్ ను కంప్లీట్ చేసి విదేశాలకు వెళ్ళింది. ట్రీట్మెంట్ తో పాటు రెస్ట్ తీసుకుంది. ఆధ్యాత్మిక పర్యటనల్లో మునిగితేలింది. ప్రకృతిని ఆస్వాదిస్తూ గడిపింది. రీసెంట్ గా ఇండియాకు వచ్చింది. హెల్త్ సెట్ అవ్వడంతో మళ్ళీ సినిమాలతో బిజీ అయ్యేందుకు సిద్ధమైంది. తన సొంత బ్యానర్ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పై మా ఇంటి బంగారం పేరుతో మూవీ అనౌన్స్ చేసింది. అయితే సామ్.. త్వరలో సిటాడెల్ హనీ బన్నీ వెబ్ సిరీస్ తో ప్రేక్షకుల ముందుకు రానుంది. రాజ్ అండ్ డీకే దర్శకత్వం వహించిన ఆ సిరీస్.. అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది. రీసెంట్ గా ఆ సిరీస్ ప్రీమియర్ ను లండన్ లో ప్రదర్శించారు. ఆ కార్యక్రమానికి సమంత అటెండ్ అయింది. సింపుల్ ప్లెయిన్ కలర్ డ్రెస్ వేసుకున్న అమ్మడు.. అక్కడ ఎట్రాక్షన్ గా నిలిచింది. అందుకు సంబంధించిన ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో షేర్ చేసింది. ప్లెయిన్ ట్రెండీ డ్రెస్ లో సమంత అదిరిపోయింది. క్రేజీ పోజులతో మైండ్ బ్లాక్ చేసింది. సింపుల్ గా కనిపిస్తూనే ఆకట్టుకుంది. ప్రస్తుతం సామ్ పిక్స్ నెట్టింట తెగ చక్కర్లు కొడుతున్నాయి. ఫోటోస్ అదిరిపోయాయని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఏ ఔట్ ఫిట్ అయినా అమ్మడు సూపర్ అని చెబుతున్నారు. లైక్స్ కొడుతూ కామెంట్ సెక్షన్ నింపుతున్నారు. మరోవైపు, సిటాడెల్ వెబ్ సిరీస్ కోసం సామ్ చాలా కష్టపడింది. అనేక విద్యలు నేర్చుకుంది. షూటింగ్ టైమ్ లో హెల్త్ ఇష్యూ వల్ల పలుమార్లు ఇబ్బందులు ఎదుర్కొంది. ఈ విషయాలను స్వయంగా ఆమెనే చెప్పింది. ఇప్పుడు జోరుగా ప్రమోషన్స్ చేసేందుకు సిద్ధమైంది. మరి ఈ వెబ్ సిరీస్ తో సమంత ఎలాంటి హిట్ అందుకుంటుందో వేచి చూడాలి












Published and Printed by Vulloju Srinivas On Behlf of Sri Veena Publications Printed at Telalangana Veena Flat NO: 204 Mythri Apartments, Opp Bsnl Office Ecil,Kapra,Med
Responsibble for Selection of News Under The PRB ACT, Phone Number: 040 35668720, RNI Reg N0: TELTEL/12280 Reproduction in Whole or in Part Without Written